చేసింది మోసం..
చెప్పేది అబద్ధం!

అసత్య ప్రచారాలకు తెరలేపిన వైసీపీ

ప్రజలకు భారీగా లబ్ది అంటూ కరపత్రాల పంపిణీ

సీఎం జగన్మోహన్‌రెడ్డి సంతకంతో ఇంటింటికీ అందజేత


ఇవ్వని నగదు కూడా ఇచ్చినట్లు లెక్కలు

మోసంతో గెలవాలని కుట్ర




● దగదర్తికి చెందిన ఓ వ్యక్తి చదువు పూర్తి చేసుకొని ఐదేళ్ల నుంచి బస్సు కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆ వ్యక్తికి వైసీపీ ప్రభుత్వంలో విద్యాదీవెన కింద రూ.31,246 అందజేసినట్లు సచివాలయ ఉద్యోగులు అందించిన కరపత్రంలో పేర్కొన్నారు. అసలు తనకు విద్యాదీవెన ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా లెక్కలు చూపించడంతో ఆ వ్యక్తి ఆశ్చర్యపోయాడు.

● నెల్లూరు బీవీనగర్‌కు చెందిన ఓ కుటుంబానికి రూ.9.79 లక్షలు సాయం అందించినట్లు చూపించారు. జగనన్న తోడు పథకం కింద రూ.10 వేలు రుణం ఇచ్చి తిరిగి కట్టించుకున్నా ఈ పథకం కింద రూ.20 వేలు సాయం అందించినట్లు లెక్క రాశారు. అక్కచెరువుపాడులో ఆరు అంకణాల స్థలం ఇచ్చినట్లు చెబుతూ దాని విలువను రూ.6 లక్షలుగా చూపించారు. వాస్తవానికి ఈ వ్యక్తికి పట్టా ఇచ్చారు గానీ క్షేత్రస్థాయిలో మాత్రం స్థలం లేదు. ఆ స్థలం కోర్టు కేసులో ఉంది. ఇక స్థలమే లేకపోతే అక్కడ ఇల్లు నిర్మించినట్లుగా చూపిస్తూ మరో రూ.2.50 లక్షలు సాయం అందించినట్లు అబద్ధాలను కరపత్రాల రూపంలో అందించారు.



ఏం చెప్పినా ప్రజలు గుడ్డిగా నమ్మేస్తారులే.. మనం చెప్పిందే వేదం.. అన్న రీతిలో వైసీపీ వ్యవహరిస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల కోడ్‌కు ముందు సచివాలయ సిబ్బంది 'గడప గడపకూ సంక్షేమం' పేరుతో ముద్రించిన కరపత్రాలను ప్రతి కుటుంబానికి పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ కుటుంబానికి ఏయే పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వివరాలను లెక్కలతో సహా చూపించారు. అదంతా ఉచితంగా ఆ కుటుంబానికి ప్రభుత్వం అందజేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఈ ప్రచార క్రమంలోనే ఇచ్చినవి, ఇవ్వనవి అన్నింటినీ లెక్కల్లో కలిపేశారు. రుణం కింద ఇచ్చిన వాటిని కూడా ఉచితంగా సాయం కింద ఇచ్చినట్లు చూపించడంతో ప్రజలు నివ్వెరపోతున్నారు. ఈ కరపత్రాల్లోని లెక్కలను వివరిస్తూ ఇప్పుడు వైసీపీ నేతలు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంతకంతో రూపొందించిన ఈ కరపత్రాల్లోని లెక్కలు పచ్చి అబద్ధాలతో కూడుకున్నాయి. కొన్ని పథకాలను ఆ కుటుంబాలకు ఇవ్వకున్నా ఇచ్చినట్లు భారీగా లెక్కలు చూపించారు. చాలా చోట్ల ఇంటి స్థలం ఇచ్చినా ఇళ్లు నిర్మించి ఇవ్వలేదు. నాలుగేళ్ల నుంచి అదిగో.. ఇదిగో ఇళ్లు అంటూ ఆశ చూపి పేదలను మోసం చేశారు. కానీ ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు సాయం చేసినట్లు అబద్ధాలు ముద్రించారు. ఇంటి స్థలం విలువను మూడు, నాలుగు రెట్లు అధికంగా ధర చూపించి కరపత్రాల్లో లెక్కలు చూపించారు. జగనన్న తోడు పథకం కింద రూ.10 వేలు ఇచ్చి, దాన్ని తిరిగి కట్టించుకున్నారు. అయితే ఇది కూడా ఉచితంగా అందజేసినట్లు కరపత్రాల్లో ముద్రించారు. డ్వాక్రా రుణాలను తీసుకున్న మహిళలు తిరిగి నెలసరి వాయిదాల్లో చెల్లిస్తున్నారు. ఆ మొత్తాన్ని కూడా ఏదో సాయంగా అందించినట్లు లెక్కలు చూపించడంతో మహిళలు ఆశ్చర్యపోతున్నారు. పొందని లబ్ధిని కూడా పొందినట్లు జగన్ సంతకంతో ముద్రించిన కరపత్రాల్లో చూపించారంటే, ఆయన అబద్ధాలు ప్రచారం చేస్తున్నారా..? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ నిజంగా ఈ లెక్కలు నిజమైతే ఆ లెక్కల్లోకి రాని డబ్బులను ఎవరు తినేసినట్లు.. అంటూ పెదవి విరుస్తున్నారు. ఇలా అసత్యపు ప్రచారాలు చేసుకుంటూ, ప్రజలను మభ్యపెట్టి వచ్చే ఎన్నికల్లో గెలవాలని వైసీపీ కుట్రలు చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి



● మనుబోలుకు చెందిన ఓ కుటుంబానికి గత ఐదేళ్లలో రూ.7.49 లక్షల లబ్ధి చేకూర్చినట్లు కరపత్రంలో పేర్కొన్నారు. ఆ కుటుంబం సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకోగా అందుకు రూ.1.50 లక్షలు అందించినట్లు చూపించారు. అయితే మరో రూ.2.50 లక్షలు ఇల్లు నిర్మించుకోవడానికి ఇచ్చినట్లు పచ్చి అబద్ధాలను లెక్కల్లో పేర్కొన్నారు. దీంతో ఆ రూ.2.50 లక్షలు ఎవరు తీసుకున్నారబ్బా.. అంటూ ఆ కుటుంబం ఆశ్చర్యపోయింది.

కుటుంబ లబ్దిపై ఇంటింటికి వైసీపీ కరపత్రాలు



దామవరం ఎయిర్‌పోర్టు భూముల్లో సీఎంగా గతంలో చంద్రబాబు నాయుడు ఆవిష్కరించిన శిలాఫలకం పైలాన్



ఏమి చెప్తిరి..
ఏమి చెప్తిరి..

విజయసాయిరెడ్డి మాటలపై విస్మయం

ఐదేళ్లు మిన్నకుండి ఇప్పుడు విమానాశ్రయం మాట!

గెలిస్తే అంతర్జాతీయస్థాయిలో నిర్మిస్తామని ప్రగల్భాలు

కావలి, ఏప్రిల్ 1 : ఏమి చెప్తిరి.. ఏమి చెప్తిరి విజయసాయిరెడ్డి. వినే వారుంటే చెప్పేవాళ్ల కొదవ అన్నట్టుంది ఆయన మాటలు. ఇటీవల దగదర్తి మండలంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన నెల్లూరు ఎంపీ వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డికి అక్కడ విమానాశ్రయం గుర్తుకు వచ్చినట్లు ఉంది. ఇంకేముంది... ఏది చెప్పినా ప్రజలు నమ్ముతారని విజయసాయి కట్టుకథలు అల్లారు. ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావులతో కలిసి పాల్గొన్న సభలో విమానాశ్రయం గురించి విజయసాయి కల్లిబొల్లి మాటలు చెప్పారు. విమానాశ్రయ నిర్మాణాన్ని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆపించారని, వైసీపీ మరలా అధికారంలోకి వస్తే గన్నవరం, విశాఖలా కాకుండా హైదరాబాద్‌లోని అంతర్జాతీయ స్థాయిలో దగదర్తిలో విమానాశ్రయం నిర్మిస్తామంటూ ప్రగల్భాలు పలికారు. గడిచిన ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీకి గుర్తుకురాని విమానాశ్రయ నిర్మాణం ఇప్పుడు ఎన్నికల సమయంలో గుర్తుకు రావటం ఏమిటంటూ ప్రజలు విస్తుపోయారు. అమ్మకు అన్నం పెట్టలేనోడు పిన్నమ్మకు బంగారు గాజులు కొనిస్తానన్నట్లుగా గతంలో శంకుస్థాపన చేసిన విమానాశ్రయాన్నే రద్దు చేసి ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో విమానశ్రయం నిర్మిస్తామని చెప్పడం చూస్తే నమ్మటానికి తామేమి అమాయకులు కామంటూ ప్రజలు అంటున్నారు. ఐదేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దామవరం వచ్చి విమానశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనుల ప్రారంభానికి అవసరమైన భూములను కూడా కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు.

అయితే, అంతలో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావటంతో చంద్రబాబు శంకుస్థాపన చేసిన విమానశ్రయ నిర్మాణ కాంట్రాక్ట్‌ను రద్దు చేయించారు. మరలా టెండర్ పిలుస్తారని ప్రజలు భావిస్తున్న తరుణంలో అసలు ఇక్కడ విమానశ్రయమే లేదని, దానిని కందుకూరు నియోజకవర్గంలోని తెట్టు వద్ద నిర్మిస్తున్నట్లు వైసీపీ ప్రభుత్వం ప్రకటన చేసింది. అయితే అక్కడ భూసేకరణ కష్టంగా ఉండటంతో దానిని గాలికి వదిలేసింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావటం.. టీడీపీ ప్రభుత్వం వస్తే దగదర్తిలో విమానశ్రయ నిర్మాణం చేపడతామని ఆ పార్టీ నాయకులు చెప్పారు. దీంతో వైసీపీ దీని ప్రభావం తమపై ఎక్కడ పడుతుందోనని భావించి కొత్త నాటకానికి తెరతీసింది. దగదర్తి ప్రచారంలో ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి తన ప్రసంగంలో గతంలో దీనిని చంద్రబాబు ఆపించారని, వైసీపీ మరలా అధికారంలోకి వస్తే అంతర్జాతీయ స్థాయిలో విమానశ్రయం నిర్మిస్తామని చెప్పారు. ఇప్పటివరకు గుర్తుకు రాని విమానాశ్రయం ఎన్నికలప్పుడు గుర్తుకు రావటం ఎన్నికల స్టంట్ లో భాగమేనని ప్రజలు చర్చించుకుంటున్నారు.


విమానాశ్రయ భూముల్లో గ్రావెల్ కోసం తవ్వకాలు జరపడంతో ఏర్పడిన గుంతలు

● విస్తృతంగా గ్రావెల్ తవ్వకాలు

విమానాశ్రయం కోసం సేకరించిన భూములను కూడా వైసీపీ నాయకులు ఆదాయ వనరుగా మలుచు కున్నారు. అక్కడున్న భూముల్లో భారీ ఎక్స్‌కవేటర్ల ద్వారా తవ్వి గ్రావెల్‌ను అమ్మి సొమ్ము చేసుకున్నారు. దీనిని అడ్డుకున్న వారిపైనా కేసులు పెట్టారు. అధికారులకు ఫిర్యాదులు అందినా పట్టించుకున్న దాఖలాలు లేవు. అలాంటి గోతులన్న భూముల్లో విమానాశ్రయ నిర్మాణం ఎలా సాధ్యమవుతోందనే చర్చ విస్తృతంగా నడుస్తోంది. నిజంగా విమానశ్రయం కట్టాలనే ఆలోచన అధికార పార్టీ నాయకుల్లో ఉంటే ఆ భూములలో పెద్ద పెద్ద గోతులు తీసి గ్రావెల్ తరలించే వారు కాదు. కేవలం ఎన్నికలలో మభ్యపెట్టడానికే ఉత్తుత్తి హామీలు ఇస్తున్నారని, వాటిని నమ్మి మోసపోయే స్థితిలో ఈ ప్రాంత ప్రజలు లేరని చెబుతున్నారు.

టీచరుపై కేసు నమోదు

వరికుంటపాడు, ఏప్రిల్ 1: వింజమూరు మండలం నందిగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయుడు జక్కం మోహన్‌రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి తీరుపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కోడ్ ఉన్నా.. డోంట్‌కేర్ కథనానికి స్పందించారు. అందులో భాగంగా మండల ఎంసీసీ నోడల్ అధికారి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆ ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేయించారు.

సోమశిలలో 9.712 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం : సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి ప్రాజెక్టులో 9.712 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 300, డెల్టాకు 920, దక్షిణ కాలువకు 220 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.


పలుకూరులో జరిగిన రోడ్‌షోలో ఎడ్లబండిపై నుంచి అభివాదం చేస్తున్న అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు

నెల్లూరులోనే ఉండి సేవ చేస్తా..

ఆయన గెలిస్తే ఢిల్లీకి ఎక్స్‌పోర్ట్ అవుతారు!

● కందుకూరు ప్రచారంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 1 : 'నన్ను గెలిపిస్తే గెలిచాక ఆఫ్రికా, దుబాయ్‌లలో ఉంటానని ప్రచారం చేస్తున్నారు. అయితే నేనెక్కడికీ పోయేవాడిని కాదు.. నెల్లూరులోనే ఉండి ప్రజలకు సేవ చేస్తా'నని తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి సోమవారం కందుకూరు మండలం పలుకూరు గ్రామంలో రోడ్‌షో నిర్వహించి ప్రసంగించారు. తమ ట్రస్టు తరఫున నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నానని, 150 గ్రామాలలో వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి ఢిల్లీ నుంచి ఇంపోర్ట్ అయ్యాడని, ఆయన్ను గెలిపిస్తే మళ్లీ ఢిల్లీకి ఎక్స్‌పోర్టు అవుతాడని విమర్శించారు. జిల్లాలో తన సేవల గురించి తెలియని వారు లేరని అలాంటిది నెల్లూరు మొహమే తెలియని విజయసాయి తనను విమర్శిస్తుండటం చోద్యంగా ఉందని అన్నారు. వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ చేయరాదని ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయమని ప్రత్యామ్నాయంగా పంపిణీకి ఏర్పాట్లు చేయాల్సిన ప్రభుత్వం టీడీపీపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా పలుకూరులో తాగునీరు, ఇతర సమస్యలపై గ్రామస్థులు వారి దృష్టికి తీసుకురాగా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రథమ ప్రాధాన్యంగా పరిష్కరిస్తామని అన్నారు.

● **నేను పక్కా లోకల్ : ఇంటూరి**

అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ 'నేను పక్కా లోకల్.. ఇక్కడే పుట్టాను ఇక్కడే పెరిగాను. వైసీపీ తరఫున పోటీచేస్తున్న బుర్రా మధుసూదన్‌యాదవ్ నాన్ లోకల్ అభ్యర్థి. కనిగిరిలో ఆయన చేసిన ఘనకార్యాలతో అక్కడ గెలవరని ఇక్కడికి పంపించారు. రాష్ట్రంలో నెలకొన్న దారుణమైన పరిస్థితుల గురించి మనందరికీ తెలుసు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి శుభం జరుగుతుందని' అన్నారు. వీరభద్రస్వామి ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పలుకూరు బీసీ కాలనీ, వెంకన్నపాలెంకు చెందిన పలువురు టీడీపీలో చేరారు.

పది మూల్యాంకనం ప్రారంభం

● 1,095 మంది విధులకు హాజరు ● ఉపాధ్యాయుల డుమ్మా యత్నాలు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 1 : నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం మొదలైంది. ఈనెల 8వతేదీ వరకు ఇది కొనసాగనుంది. వివిధ జిల్లాలకు చెందిన 1,80,393 లక్షల సమాధాన పత్రాలు జిల్లాకు చేరడంతో వీటిని కట్టుదిట్టమైన భద్రత నడుమ మూల్యాంకనం చేసేందుకు విద్యాశాఖ 1,599 మంది సిబ్బందిని నియమించింది. ఎండవేడిమి తీవ్రంగా ఉండడం, ఇతర కారణాలతో అత్యధిక శాతం మంది ఉపాధ్యాయులు గైర్హాజరయ్యేందుకు ప్రయత్నించారు. వీరిలో కొంతమందిని అధికారులు రిలీవ్ చేయగా మరికొంత మంది తప్పనిసరి పరిస్థితుల్లో విధులకు హాజరు కావాల్సి వచ్చింది. హాజరైన సిబ్బందికి మెస్ సౌకర్యం, షామియానాలు ఏర్పాటు చేయకపోవడంతో అందరూ చెట్లకిందనే డ్యూటీలు వేసే వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. మెస్ వసతి కల్పించకపోవడంతో ఉపాధ్యాయులంతా చెట్లనీడన, పాఠశాల ప్రాంగణంలో భోజనాలు చేస్తూ కనిపించారు.

ఈ మూల్యాంకనం కోసం 169 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 1055 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్, 375 స్పెషల్ అసిస్టెంట్లు, విద్యాశాఖ సిబ్బంది 50 మంది కలిపి మొత్తం 1649 మందిని మూల్యాంకన విధులకు నియమించారు. అయితే తొలిరోజు 1,095 మంది మాత్రమే విధులకు హాజరై 14,300 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు. ప్రతి రోజూ ఉదయం 8.45 నుంచి 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు మూల్యాంకనం జరగనుంది. ఒక్కో ఉపాధ్యాయుడు రోజుకు కనీసం 35 నుంచి 40 జవాబుపత్రాలను దిద్దాల్సి ఉంటుంది.

● **కట్టుదిట్టమైన చర్యలు : డీఈవో**

మూల్యాంకనానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు డీఈవో రామారావు తెలిపారు. సిబ్బంది పనితీరు, మూల్యాంకనం చేసే విధానాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరేట్‌కు అనుసంధానం చేశామని చెప్పారు. మూల్యాంకన సమయంలో మొబైల్ ఫోన్లను కూడా అనుమతించమని, ఒకవేళ మొబైల్‌లో మాట్లాడుతూ ఉపాధ్యాయులు కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమాధాన పత్రాలు దిద్దే ఎగ్జామినర్ల నియామకంలో పదో తరగతికి మూడేళ్లు బోధించిన అనుభవం ఉన్నవారికే అవకాశం కల్పించామన్నారు. నిర్దేశించిన సంఖ్య మేరకు మూల్యాంకనం పూర్తికాకపోతే అదనపు సమయమైనా తీసుకుని పని పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. విధులకు హాజరయ్యే సిబ్బంది ప్రతి ఒక్కరూ బయోమెట్రిక్‌లో వేలిముద్రలు తప్పనిసరిగా వేయాలని సూచించారు.


టీచర్లనుద్దేశించి మాట్లాడుతున్న డీఈవో రామారావు, పక్కన ఆర్జేడీ రామలింగం

'నవోదయ' ప్రవేశాల ఫలితాలు విడుదల

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 1 : జిల్లాలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయలో 2024-25 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు సంబంధించిన వివరాలను విద్యాలయ నోటీస్‌బోర్డులో అందుబాటులో ఉంచామని, త్వరలో తల్లిదండ్రులకు కూడా సమాచారం అందచేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 8985007588 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రజలను మోసం చేయడమే

● దళిత సంఘర్షణ సమితి ఆగ్రహం

దామవరం విమానశ్రయం మరలా తెస్తానని ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు చెప్పడం ప్రజలను మోసం చేయడమేని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. సోమవారం కావలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దగదర్తిలో ఆదివారం జరిగిన ప్రచారంలో అంతర్జాతీయ విమానశ్రయం తెస్తామని విజయసాయి చెప్పడం జిల్లావాసులను మోసం చేయడమేనన్నారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ఆ ప్రాంతంలో నిర్మించిన ఫ్యాక్టరీలలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వకుండా రొయ్య పొట్టు తీసేందుకు ఈ ప్రాంతవారిని కూలీలుగా వాడుకున్నారని మండిపడ్డారు. కారుచౌకగా ప్రభుత్వ భూమిని కొట్టేసి ఫ్యాక్టరీలు నిర్మించి ఈ ప్రాంతవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవటం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు విజయరత్నం, వెంకటరత్నం, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నగలు కోసమే వృద్ధురాలి దారుణహత్య

సుత్తితో మోది, కత్తితో పొడిచి ఘాతుకం

స్నేహితుడితో కలిసి హతమార్చిన మహిళ



నిందితుల వివరాలు తెలియచేస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 1: నెల్లూరు నగరంలో జరిగిన వృద్ధురాలి దారుణహత్య కేసును పోలీసులు ఛేదించారు. వృద్ధురాలికి పరిచయం ఉన్న ఓ మహిళ తన స్నేహితుడితో కలిసి నగలు కోసమే ఆమెను దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు విచారణలో వెల్లడైంది. నిందితుల వివరాలను చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ బీ అశోక్‌కుమార్ సోమవారం తన కార్యాలయంలో విలేకరులకు వివరించారు. గూడూరుకి చెందిన లీలావతి(60), భాస్కర్‌రెడ్డిలు దంపతులు. వారికి ఓ కుమారుడు ఉన్నాడు. ఆమె భర్త నుంచి విడిపోయి అరవిందనగర్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటోంది. గత నెల 23వ తేదీన ఆమె ఉంటున్న ఇంట్లో నుంచి తీవ్ర దుర్వాసన వస్తుండటంతో స్థానికులు చిన్నబజారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి ఇన్‌సెక్టర్ బీ అశోక్‌కుమార్, ఎస్ఐ సైదులు తమ సిబ్బందితో చేరుకొని ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా లీలావతి ఒంటిపై తీవ్రగాయాలతో మృతి చెంది పడి ఉంది. పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

● నగల కోసమే హత్య

చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ బీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు లీలావతి హత్య కేసు దర్యాప్తును ముమ్మరం చేశాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సీసీపుటేజ్‌ల ద్వారా కేసును ఛేదించారు. చట్టవ్యతిరేక పనులు చేసే లీలావతికి భగత్‌సింగ్‌కాలనీ టిడ్కో ఇళ్లలో నివాసం ఉండే గంజా పెంచలప్రసన్నతో పరిచయం ఏర్పడింది. ప్రసన్నను లీలావతి చట్టవ్యతిరేక పనులకు ఉపయోగించుకునేది. ఈ క్రమంలో లీలావతి వద్ద బంగారు నగలు ఉండటాన్ని ప్రసన్న గమనించింది. ఇదే సమయంలో ప్రసన్నకు టిడ్కో ఇళ్లలో నివాసం ఉండే షేక్ అజీమ్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ సన్నిహితంగా ఉండేవారు. లీలావతి వద్ద ఉన్న నగలు దోచుకుంటే ఇద్దరం స్థిరపడవచ్చని ప్రసన్న, అజీమ్‌లు పథకం వేశారు. దీంతో గత నెల 19న ఇద్దరు లీలావత ఇంటికి వెళ్లారు. అనంతరం ఆమెను సుత్తితో మోది, కత్తితో పొడిచి హత్యచేశారు. ఆపై ఒంటిపై ఉన్న బంగారు కమ్మలు, సరుడు, గాజులు, ఉంగరం తీసుకుని, ఇంట్లో ఉన్న రూ.80వేల నగదు, మొబైల్‌ను దోచుకుని పరారయ్యారు. పోలీసులు సీసీపుటేజ్‌లు పరిశీలిస్తున్న సమయంలో పెంచల ప్రసన్న, షేక్ అజీమ్‌లు హడావిడిగా సంఘటనా స్థలం నుంచి రావడాన్ని గుర్తించారు. ఈ క్రమంలో ఈనెల31న చిన్నబజారు మెయిన్‌రోడ్డులోని ఓ ఫైనాన్స్ కంపెనీ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తమదైన శైలిలో వారిని విచారించగా నిందితులు నేరాన్ని అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి రూ.6.15లక్షల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐలు సుధీర్, లతీఫున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరులో వరుస చోరీలు

కావలి రూరల్, ఏప్రిల్1: పట్టణంలోని ముసునూరు బాలాజీవీధిలో తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి చోరీకి పాల్పడగా, సోమవారం గుర్తించారు. బాధితుడు మాదాల సురేష్ తండ్రి వెంకట్రావ్ కథనం మేరకు, సురేష్ భార్య, పిల్లలతో కలసి ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉంటున్న తన సోదరి వద్దకు గతనెల 25న వెళ్లాడు. ఆదివారం రాత్రి ఇంటి వెనుక వైపు నుంచి ప్రవేశించిన దుండగులు బయట గ్రిల్స్ తాళం తీయడంతో పాటు గడ్డపారతో తలుపు తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న బీరువా తాళం కూడా పగలగొట్టి అందులోని దుస్తులను చిందరవందరగా పడేశారు. అనంతరం బీరువాలోని వెండి వస్తువులతోపాటు కొంత నగదు తీసుకువెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి గ్రిల్స్ తీసి ఉండటాన్ని గుర్తించిన బాధితుడి తండ్రి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు తెలిపాడు. వారు వచ్చి పరిశీలించి వెళ్లారు. సమాచారం అందుకున్న బాధితులు మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి కావలి రానున్నారు. బాధితులు వస్తేగాని ఏమేరకు చోరీ జరిగిందో తెలియదు.



బీరువా పగలగొట్టి ఉండటాన్ని చూపుతున్న బాధితుడి తండ్రి మాదాల వెంకట్రావ్



గడ్డపారతో పగులగొట్టిన ప్రధాన ద్వారం తాళం

● మహిళ మెడలో సరుడు చోరీ

ముసునూరు పాతూరులో ఉక్కపోతకు ఇంటి తలుపులు తీసి భార్య, భర్త నిద్రిస్తుండగా ఆదివారం అర్ధరాత్రి దుండగులు ఇంట్లోకి ప్రవేశించారు. నిద్రిస్తున్న మర్రిబోయిన కోటేశ్వరి మెడలోని మూడు సవర్ల బంగారు సరుడు లాగటంతో ఆమె పెద్దగా కేకలు వేసింది. దీంతో దుండగులు సరుడు లాక్కుని పరారయ్యారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రూరల్ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాల దగ్ధం

మనుబోలు, ఏప్రిల్ 1: మండలంలోని గురివిందపూడి పంచాయతీలో ఆదివారం రాత్రి డీలర్ కంటిపూడి సుబ్రహ్మణ్యం ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి గృహోపకరణాలు దగ్ధం అయ్యాయి. ఫ్రిజ్‌లోంచి పొగలు వ్యాపించి తద్వారా ఇల్లంతా మంటలు అలుముకోవడంతో ఇంట్లో ఉన్న వంట సామగ్రి, గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయని, ఈ ప్రమాదంతో లక్ష రూపాయల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.



దగ్ధమైన వంట సామగ్రి

దాడి కేసులో ఎస్ఐకి ఆరునెలల జైలు

● రూ.10 వేల పరిహారం

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 1: మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడి ఓ వ్యక్తిపై చేయి చేసుకున్నాడన్న కేసులో బిట్రగుంట ఎస్ఐగా పనిచేసిన వెంకటరమణకు ఆరునెలల జైలుశిక్షతో పాటు రూ. 10 వేల పరిహారాన్ని ఫిర్యాదికి చెల్లించాలని ఆదేశిస్తూ నెల్లూరు జిల్లా హ్యూమన్ రైట్స్ కోర్టు స్పెషల్ జడ్జి జీ కబర్ది సోమవారం తీర్పు చెప్పారు. బోగోలు గ్రామానికి చెందిన ఫిర్యాది చలపతి వెంకటేశ్వర్లు కథనం మేరకు ఈ కేసు వివరాలు. చలపతి వెంకటేశ్వర్లు బోగోలు -2 ఎంపీటీసీగా పనిచేస్తున్నాడు. 2016లో బిట్రగుంట ఎస్ఐగా పనిచేస్తున్న వెంకటరమణ మానవ హక్కులకు విఘాతం కల్గిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నాడని వెంకటేశ్వర్లు 2016 మే 24న కావలి డీఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో 2016 జూన్ 24 తేదీ ఉదయం 10.10 గంటల సమయంలో వెంకటేశ్వర్లు తన స్నేహితులతో కలసి బోగోలు బజారులోని మైలాపూర్ బాబు టీ అంగడి దగ్గర ఉండగా, ఎస్ఐ ఐదుగురు కానిస్టేబుళ్లతో జీపులో వచ్చి వారిని అసభ్య పదజాలంతో దూషించి వెంకటేశ్వర్లు చొక్కా పట్టుకున్నాడు. ఎందుకు మమ్మల్ని తిడుతున్నారని వారు ప్రశ్నించగా ఎస్ఐ. చెంప మీద కొట్టి గాయపరిచాడు. పదిమందిలో ఎస్ఐ తనను అవమానించి తన హక్కులకు భంగం కల్గించాడని పేర్కొంటూ కావలి జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో వెంకటేశ్వర్లు తన న్యాయవాది ద్వారా ప్రైవేట్ కంప్లయింట్ దాఖలు చేశారు. అనంతరం సదరు కేసును నెల్లూరు మానవ హక్కుల ప్రత్యేక కోర్టులో విచారణ నిర్వహించారు. నిందిత అధికారిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 1 : ఉదయగిరి బార్ అసోసియేషన్ మెంబర్, న్యాయవాది రాజగోపాల్‌రెడ్డిపై మర్రిపాడు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి చేసిన దాడికి నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు తమ నిరసన తెలిపారు. న్యాయవాదిపై చేసిన దాడిని బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీ ఉమామహేశ్వర్ రెడ్డి, మద్దిబోయిన సుందరయ్య యాదవ్‌లు తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం కూడా న్యాయవాదులు విధులను బహిష్కరించి తమ నిరసనను తెలియజేయాలని అత్యవసరంగా సమావేశమైన బార్ కమిటీ తీర్మానం చేసిందని వారు పేర్కొన్నారు. న్యాయవాదులు విధులు బహిష్కరించడంతో కోర్టుల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. కాగా ఇటీవల కాలంలో న్యాయవాదులపై పోలీసుల దాష్టీకాలు ఎక్కువ అవుతున్నాయని, పోలీసు ఉన్నతాధికారులు అలాంటి అధికారులపై కఠినంగా వ్యవహరించాలని పలువురు న్యాయవాదు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	133
లేయర్ లైవ్	73
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	264
లేయర్	125

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6547
వెండి కిలో ధర	రూ. 77,700
వెండి ఒక గ్రాము	రూ. 79.70

డెల్టాలో ప్రత్యామ్నాయం లేదా ?

- రబీ సాగు పూర్తయితే బీళ్లుగా పొలాలు
- ఎంఎస్‌పీ నిర్ధారణపై ప్రభుత్వం మీనమేషాలు
- రైతుల అభివృద్ధిని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

అల్లూరు, ఏప్రిల్ 1 : డెల్టాలో రబీ సాగు పూర్తయ్యాక ప్రత్యామ్నాయం లేదా...? అనేది రైతుల మెదళ్లను తొలుస్తున్న ప్రశ్న. గతంలో వరిసాగులో ఘోరంగా దెబ్బతిన్న రైతులు ప్రస్తుతం రెండో పంటతో కోలుకుంటున్నారు. ప్రత్యామ్నాయ పంటలను వేసే అవకాశం లేక, ఒకప్పుడు సోమశిల ఆయకట్టు పరిధిలోని నెల్లూరు, సంగం డెల్టా ప్రాంతం రైతులు ధర్నాలు చేపట్టి సాగునీటిని సాధించుకునేవారు. ఈ ఏడాది జలాశయాలు అడుగంటిపోవడంతో రెండోకారు సాగు చేయలేదు. డెల్టా ప్రాంతమైన దాదాపు 2.34 లక్షల ఎకరాల్లో కేవలం వరి సాగే చేస్తున్నారు. వరిసాగు మినహా డెల్టాకు ప్రత్యామ్నాయమే లేదా? అనేది నేడు ఈ ప్రాంత రైతాంగాన్ని వేధిస్తున్న ప్రశ్న.

● అవగాహన లేకే...

ఇటీవల ధాన్యానికి ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు వరి సాగుతో సంతృప్తి చెందుతున్నారు. కానీ ఒకే పంట కావడంతో ఏడాదిలో ఐదు నెలలు మాత్రమే సాగుచేసుకుని, మిగిలిన కాలమంతా భూములను బీళ్లు పెట్టుకుంటున్నారు. ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పవచ్చు.శాస్త్రవేత్తలను తీసుకొచ్చి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. కానీ ఆ చర్చలు ఫలితాన్నివ్వలేదు. కష్టపడిన రైతుకు గిట్టుబాటు ధర లభిస్తే ఒకరి సిఫారసు లేకుండా, పండించేందుకు స్వతహాగా సిద్ధపడతాడు. రెండో పంట లేని కాలంలో ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితోనో లేక నీటితో అవసరం లేని రెండు నెలల కాలం పంటలను వేసుకుంటారు. కానీ ప్రస్తుతం పరిస్థితుల్లో కొత్త పంటలను సాగు చేయలేమంటూ రైతులు అంటున్నారు.



ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

● సారవంతమైన భూములు ఉన్నా...

డెల్టా ఆయకట్టులో సారవంతమైన భూములు ఉన్నాయి. పలు వాణిజ్య పంటలు వేసేందుకు అవకాశం ఉన్నప్పటికీ రైతులు ఆదిశగా ముందుకు రావడం లేదు. గతంలో జలాశయాల్లో సాగునీరు పుష్కలంగా ఉండేది కానీ సాగు వ్యయం అధికమవడంతో రైతులు భరించ లేని పరిస్థితుల్లో ఉండిపోయారు. కానీ వాణిజ్య పంటలు పండించిన రైతులకు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంది.

● ఎంఎస్‌పి నిర్ధారణకు మీనమేషాలు

రైతులు పండించిన ధాన్యానికి ఒక నిర్దిష్ట ధరను ప్రభుత్వం నిర్ణయించి రైతులను నష్టపోకుండా చేసే ప్రక్రియను ఎంఎస్‌పీ (మినిమమ్ సెల్లింగ్ ప్రైస్) అంటారు. దీని గురించి ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీన్ని అమలు చేస్తే రైతే రారాజు కానున్నాడు.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తే మేలు

రెండోకారు పంట ఉంటుందా లేదా అనే సంశయం బదులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తే రైతులకు మేలు చేసినట్టే. ఏ పంట పండించినా రైతుకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు అందించక తీవ్ర నష్టాలపాలువున్నారు. ఈ క్రమంలో వ్యయప్రయాసలకోర్చి



రెండోకారు పంటవేయక బీడుగా మారిన డెల్టా ప్రాంతంలోని పొలం



ప్రత్యామ్నాయ పంటలు వేసుకున్న రైతులకు వెన్నుదన్నుగా ప్రభుత్వాలు నిలవాలి

-పెనుమల్లి శ్రీనివాసులురెడ్డి, రైతు, అల్లూరు

వరిసాగుపైనే ఆధారపడుతున్నాం..



డెల్టా ప్రాంత రైతులు కేవలం వరిసాగుపైనే ఆధారపడుతున్నారు. ఏడాదిలో ఒక్క పంటకే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. రైతులకు వెన్నుదన్నుగా నిలవాల్సిన ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించడం లేదు. ప్రత్యామ్నాయ పంటలు వేయమని అధికారులు అంటున్నారేతప్ప పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించలేకపోతున్నారు. ఇలా ఉంటే ప్రత్యామ్నాయ పంటలు ఎలా సాగు చేస్తాం.

- పప్పు సుధాకర్, రైతు, అల్లూరు

ఈవీఎంల గోదాముల వద్ద పటిష్ట భద్రత : కలెక్టర్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) ఏప్రిల్ 1: ఈవీఎంల గోదాముల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. నెల్లూరులోని ఆర్డీవో కార్యలయ ప్రాంగణంలోని ఈవీఎం గోదాములను సోమవారం ఆర్డీవో మలోలతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,అధికారులు ఉన్నారు.



ఈవీఎంల గోదాములను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్ తదితరులు

● ఎస్ఈ పోలింగ్ కేంద్రాల తనిఖీ

నెల్లూరు,(జడ్పీ) : నెల్లూరు నగరంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ సోమవారం పరిశీలించారు. నగరంలోని యల్లారావునగర్ తదతర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో 2,942 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్లు పని చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన చోట్ల ట్రాన్స్‌పార్మర్ల కెపాసిటీని పెంచుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాల దరఖాస్తుకు గడువు పెంపు

నెల్లూరు (వీఆర్సీ), ఏప్రిల్ 1 : ఏపీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల దరఖాస్తుకు గడువును పెంచినట్లు గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ జీ మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొలుత మార్చి 31 వరకు గడువు నిర్ణయించారని, దానిని ఈ నెల 5వరకు పొడిగించినట్లు తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి, 6,7, 8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి కూడా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లాలో గండిపాళెం (బాలురు), ఆత్మకూరు (బాలికలు), తుమ్మలపెంట (బాలికలు), నెల్లూరు (మైనార్టీ బాలురు) గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తారని తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈనెల 25న జరుగుతుందని, నెల్లూరులోని గురుకులంలో ఎలాంటి పరీక్ష లేకుండా ప్రవేశం కల్పిస్తారని వివరించారు. దరఖాస్తులను https://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలని, పూర్తి వివరాలకు 8712625045ను సంప్రదించాలని కోరారు.

భారీగా ఉపాధి సొమ్ము దోపిడీ

- ఎస్సీ, ఎస్టీల జాబ్‌కార్డుల్లో ఇతర ప్రాంతాలవారి పేర్లు
- చిన్నగోపవరంలో రెండేళ్లుగా అవినీతి ● అంబుడ్స్‌మన్ విచారణలో వెలుగులోకి..

కలువాయి, ఏప్రిల్ 1: అధికార పార్టీ నాయకుల అండదండలు, కొంతమంది ఉద్యోగుల సహకారంతో ఉపాధిహామీ పథకం సొమ్మును సిబ్బంది భారీగా దోచేశారు. కలువాయి మండలం చిన్నగోపవరంలో ఈ అవినీతి బాగోతం రెండేళ్లుగా కొనసాగింది. ఇతర ప్రాంతాల వారి పేర్లపై బోగస్ మస్టర్లు వేసుకుని రూ. లక్షలు స్వాహా చేసినట్లు తెలిసింది. ఈ కుంభకోణంపై డ్వామా అంబుడ్స్‌మన్ ఎం.వెంకటరెడ్డికి అందిన ఫిర్యాదు మేరకు ఆయన ఇటీవల చినగోపవరం వచ్చి విచారణ చేపట్టారు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.



జాబ్‌కార్డుల్లో ఉన్న ఇతర ప్రాంతాల వారి పేర్లు

● అవినీతి జరిగింది ఇలా..

ఉపాధి సిబ్బందికి పరిచయం ఉన్న ఇతర ప్రాంతాలకు చెందిన పలువురి పేర్లను గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, ఇతర కుటుంబాలకు చెందిన జాబ్‌కార్డుల్లో చేర్పించారు. ఒకటి, రెండు కాదు సుమారుగా 60 నుంచి 70 మంది పేర్లు ఇలా పలు జాబ్‌కార్డుల్లో ఎక్కించినట్లు సమాచారం. వారంతా ఉపాధి పనులకు వస్తున్నట్లు, వారి పేర్లపై బోగస్ మస్టర్లు వేసుకుని నిధులు స్వాహా చేయడం మొదలుపెట్టారు. ఇలా చాలాకాలంపాటు బోగస్ మస్టర్లు వేసుకుని భారీగా ఉపాధి సొమ్ము స్వాహా చేసినట్లు సమాచారం. ఈ తంతును చూసి అధికారులు సైతం ఆశ్చర్యపోతున్నారు.



చిన్నగోపవరంలో విచారణ జరుపుతున్న అంబుడ్స్‌మన్ వెంకటరెడ్డి (ఫైల్)

● పేర్లు ఎలా చేర్చారు...?

గ్రామంలోని ఎస్సీ, ఎస్టీల కుటుంబాల జాబ్‌కార్డుల్లో ఆ కుటుంబాలకు సంబంధం లేని ఇతర ప్రాంతాలకు చెందిన వారి పేర్లు ఎలా ఎలా ఎక్కించారు? ఉపాధిలో పనిచేసే ఉద్యోగుల ప్రమేయం లేకుండా జాబ్‌కార్డుల్లో ఇతర ప్రాంతాల వారి పేర్లు ఎక్కించడం సాధ్యమవుతుందా ? అనేది పలువురిని వేధిస్తున్న ప్రశ్న. సాధారణంగా జాబ్‌కార్డులు మంజూరు చేయాలంటే వారు ఆ గ్రామానికి చెందిన వారని, పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరించిన తరువాత ఉపాధి సిబ్బంది వారికి జాబ్‌కార్డు మంజూరు చేయాల్సి ఉంది.

● అంబుడ్స్‌మన్ విచారణ

ఈ విషయమై గ్రామస్తులు అంబుడ్స్‌మన్‌కు చేసిన ఫిర్యాదు మేరకు ఆయన ఇటీవల గ్రామానికి వచ్చి విచారణ జరిపారు. అంబుడ్స్‌మన్‌ను ఆంధ్రజ్యోతి ఫోన్‌లో సంప్రదించగా పలు జాబ్‌కార్డుల్లో ఇతర ప్రాంతాల వారి పేర్లు ఉన్నట్లు ప్రాధమికంగా గుర్తించామని తెలిపారు. ఎక్కించిన పేర్లకు ఆధారాలు ఉంటే పది రోజుల్లో అందజేయాలని క్షేత్రసహాయకులను ఆదేశించామని తెలిపారు. అన్నీ పరిశీలించాక ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

అధ్వానంగా వరకవిపూడి - అనంతపురం రోడ్డు

ప్రమాదాల బారిన వాహనచోదకులు ● పట్టించుకోని అధికారులు

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 1 : మండలంలోని వరకవిపూడి నుంచి అనంతపురం వెళ్లే పంచాయతీ శాఖకు సంబంధించిన రోడ్డు అధ్వానంగా మారింది. నాలుగు దశాబ్దాల నుంచి నుంచి ఈ రోడ్డు బాగోగుల గురించి అటు పాలకులు, ఇటు అధికారులు, చివరకు భారీ వాహనాల రాకపోకలు సాగించే వాటర్ బేస్ రొయ్యల కంపెనీ యాజమాన్యం సైతం పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా ఈ రోడ్డు గుండా ప్రయాణం ప్రమాదభరితంగా మారిందని గ్రామస్థులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరకవిపూడి నుంచి అనంతపురం వరకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం రోడ్డు గుంతలమయంగా మారింది. ముత్తుకూరు మండలంలోని పైనంపురం, నేలటూరు తదితర గ్రామాల గుండా ముత్తుకూరు, కృష్ణపట్నం గ్రామాలకు భారీ వాహనాలతోపాటు ద్విచక్ర వాహనాల రాకపోకలు నిత్యం సాగుతుంటాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించి ప్రమాదాలు నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా అనంతపురం రోడ్డు

సచివాలయాల సిబ్బందితో పింఛన్ల పంపిణీ

● జెడ్పీ సీఈవో కన్నమనాయుడు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం నుంచి గ్రామ సచివాలయాల సిబ్బందితో లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు జెడ్పీ సీఈవో కన్నమనాయుడు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మింగా తనిఖీ చేసి సంబంధిత రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈసీ ఆదేశాల మేరకు వలంటీర్లతో పింఛన్ల ప్రక్రియ నిలిపివేసినట్లు చెప్పారు. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు, సిమ్‌లు, డివైజ్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు మండలాల ఎంపీడీవోలు దేవరకొండ ఈశ్వరమ్మ, సురేష్‌బాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జెడ్పీ సీఈవో కన్నమనాయుడు

సర్వేపల్లి పోరులో కంటైనర్ టెర్మినలే కీలకం !

- వాస్తవాలు వెల్లడిస్తున్న టీడీపీ, విపక్షాలు ● మభ్యపెట్టే పనిలో అధికార పార్టీ నేతలు
- ఆందోళనలో ఆధారిత పరిశ్రమల ఉద్యోగులు ● పోరుకు సన్నద్ధమవుతున్న వైనం

ముత్తుకూరు, ఏప్రిల్ 1 : అదానీ కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ సమస్య రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఎన్నికల వేళ ఈ విషయం కీలకంగా మారింది. కంటైనర్ టెర్మినల్ మూసివేతలో వాస్తవాలను వెల్లడించేందుకు టీడీపీ, విపక్షాలతో కలిసి ప్రయత్నిస్తుంటే, మరోవైపు టెర్మినల్ కొనసాగుతుందని మభ్యపెట్టేందుకు అధికార పార్టీ ప్రయత్నాలు సాగిస్తోంది.



పోర్టులో ఖాళీ కంటైనర్లు దించుతున్న నౌక

● ముందుగా సమాచారం

కంటైనర్ టెర్మినల్‌ను జనవరిలో మూసివేస్తున్నామని పోర్టు యాజమాన్యం ఆధారిత పరిశ్రమల ప్రతినిధులకు మూడు నెలలకు ముందుగానే ఈమెయిల్ ద్వారా సమాచారం అందించింది. ఇకపై తాము కంటైనర్ టెర్మినల్ సేవలను కాటుపల్లి, ఎన్నూరు పోర్టు ద్వారా అందజేస్తామని, తట్టాబుట్టా సర్దుకుని అక్కడకు వచ్చేయాలని స్పష్టం చేసింది. అయితే కంటైనర్ టెర్మినల్ మూసివేత విషయాన్ని ముందుగానే టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మీడియా సమావేశంలో బట్టబయలు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎప్పటి నుంచి మంత్రి కాకాణి అధికార దాహానికి కంటైనర్ టెర్మినల్ బలైపోతుందని సోమిరెడ్డి ఆరోపిస్తూ వచ్చారు. దీన్ని ఎదుర్కొనేందుకు కంటైనర్ టెర్మినల్ సేవలు కొనసాగుతున్నాయని, మూసివేసే సమస్య లేదని మంత్రి కాకాణి ప్రకటించారు.

● ప్రకటన చేయించారు..

అప్పటికే టెర్మినల్ సేవలను వైన్‌డప్ చేయాలని నిర్ణయించుకున్న యాజమాన్యం తప్పనిసరి పరిస్థితుల్లో కంటైనర్ సేవలు కొనసాగుతాయని సీఈవో చేత జనవరి 28న ప్రకటన చేయించాల్సి వచ్చింది. అందుకోసం ఓ నౌకలో ఖాళీ కంటైనర్లను తీసుకువచ్చి పోర్టులో డంప్ చేశారు. అయితే ఖాళీ కంటైనర్లు తెచ్చారే తప్ప, కంటైనర్ సేవలను కొనసాగించే ఆలోచన పోర్టు యాజమాన్యానికి లేదన్నది ఈనెల రోజులుగా చోటు చేసుకుంటున్న పరిణామాలతో స్పష్టమవుతున్నది. కంటైనర్లు సిద్ధంగా ఉంటే సరుకుల ఎగుమతికి లైనర్లు ఏజెంట్లు ఇతర సంస్థల ప్రతినిధులు ఎగబడే పరిస్థితిలో ఉన్నా, ఈ రోజుకి ఆ దిశగా పోర్టు యాజమాన్యం చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రభుత్వం, మంత్రి కాకాణి ఒత్తిడితో ఖాళీ కంటైనర్ తెప్పించారే తప్ప సరుకులు ఎగుమతికి సంబంధించి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం, కంటైనర్‌లను రవాణా చేసే చర్యలు కానీ చేపట్టలేదని లైనర్లు ఏజెంట్లు ఆరోపిస్తున్నారు. తాము పదే పదే విజ్ఞప్తి చేసుకున్న పోర్టు సీఈవో నుంచి ఎలాంటి స్పందన లేదని చెప్తున్నారు. కేవలం ఎన్నికల పూర్తయ్యేవరకు ఉద్యోగులను, ప్రజలను మభ్యపెట్టేందుకే ఈ డ్రామాకు తెరలేపారని విమర్శిస్తున్నారు. వాస్తవంగా కంటైనర్ టెర్మినల్ కొనసాగించే ఉద్దేశం ఉంటే కంటైనర్ సేవలు కొనసాగుతాయని సీఈవో ప్రకటించి రెండు నెలలు గడుస్తున్నా, ఇవిగో కంటైనర్ అంటూ అందరికీ చూపిస్తూ మంత్రి కాకాణి ఆర్భాటం చేసి ఆరు వారాలవుతున్న ఇప్పటివరకు ఒక్క కంటైనర్‌ను ఎగుమతి చేయకపోవడం, టెర్మినల్ సేవలు మూసివేశారనేందుకు నిదర్శనంగా నిలుస్తుంది. కృష్ణపట్నం నుంచి బియ్యం, గ్రానైట్, క్వార్ట్జ్‌తో పాటు మిర్చి పత్తి ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, లైనర్లు, ఏజెంట్లు చెప్తున్నా పోర్టు యాజమాన్యం స్పందించకపోవడం గమనార్హం.

● ఆందోళనకు సన్నద్ధం

కంటైనర్ టెర్మినల్‌ను మూసివేయడాన్ని నిరసిస్తూ రోడ్డున పడ్డ 10వేల మంది ఆధారిత పరిశ్రమల ఉద్యోగులు తమ ఆందోళనను తీవ్రతరం చేసేందుకు సిద్ధమవుతున్నారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ మూసివేసి ఉద్యోగుల జీవితాలను రోడ్డుపై పడవేయడానికి మంత్రి కాకాణి కారణమని సోమిరెడ్డి.. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలను బెదిరించి దండుకోవాలని సోమిరెడ్డి ప్రయత్నిస్తున్నాడంటూ కాకాణి పరస్పర విమర్శలతో ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్నారు. జిల్లాలో కీలకంగా మారిన సర్వేపల్లి ఎన్నికల పోరులో కంటైనర్ టెర్మినల్ సమస్య ఏ ప్రభావం చూపిస్తుందో వేచి చూడాల్సిందే.!

మరమ్మతులకు నోచని వంతెనలు

- ఏళ్ల నాడు నిర్మించిన వాటిపైనే వాహనాల రాకపోకలు
- పర్యవేక్షణ చేయని అధికారులు
- వంతెనల వద్ద కూలిన సైడ్ వాల్స్



తూర్పుబోయమడుగుల సమీపంలో ప్రహరీ లేని వంతెన



భోగ్యంవారిపల్లి వద్ద ఇనుప సువ్వలు తేలిన వంతెన

వరికుంటపాడు, ఏప్రిల్ 1: జిల్లాకేంద్రానికి శివారులోని మండలం. గ్రామాల రహదారుల్లోని వంతెనలు మాత్రం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోయి ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు, వాహనదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్ల కిందట వాగులు, వంకలపై నిర్మించిన వంతెనలు ఇవి. వీటి పర్యవేక్షణను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారులతో పాటు గ్రామీణ రహదారుల పరిస్థితి అలాగే ఉన్నది. మండలంలోని పలు గ్రామాల మీదుగా 565జాతీయ రహదారి నిర్మాణం చేపట్టడంతో వాహనాల రద్దీ మరీంతగా ఎక్కువగా ఉంది. ప్రధానంగా నెల్లూరు-ప్రకాశం జిల్లాల సరిహద్దు ప్రాంతమైన భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఉప్పువాగుపై నిర్మించిన వంతెన దారి పొడవునా ఉన్న రోడ్డు గుంతలమయంగా మారినా పట్టించుకొనే నాథుడు కరువయ్యాడు. ప్రతినిత్యం ఆ మార్గంలో విజయవాడ, కడప, బెంగళూరు, విజయవాడ, నెల్లూరు, చెన్నై, తిరుపతి వంటి ప్రధాన నగరాలతో పాటు ఇతర ప్రాంతాలకు అధిక సంఖ్యలోనే ప్రభుత్వ ప్రైవేట్ వాహనాలు వెళుతుంటాయి. భారీ వాహనాల సంగతి అటుంచి ఆటోలు, మోటారు బైకులు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఫుట్‌పాత్‌పైన నడిచే అవకాశం కూడా లేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. తూర్పుబోయమడుగుల సమీపంలోని గండిపాళెం ప్రాజెక్టు పరిధిలోని 5వ నంబరు కాలువపై నిర్మించిన వంతెన ఓ వైపున రక్షణగోడ కూలిపోయింది. మలుపు ప్రాంతం కావడంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి బోల్తా పడే ప్రమాదం ఉంది. ఉదయగిరి-వరికుంటపాడు మండలాల సరిహద్దులోని జీ.కొత్తపల్లి సమీపంలోని ప్రధానరోడ్డుపై నిర్మించిన వంతెన పూర్తిస్థాయిలో ధ్వంసం అయ్యింది. యర్రంరెడ్డిపల్లి గ్రామ సమీ పంలోని కాలువపై నిర్మించిన వంతెనపై పగలు ఎలాగోలా రాకపోకలు సాగించినా రాత్రి సమయాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ప్రధాన రహదారుల సంగతే ఇలా ఉండే ఇక మారుమూల అంత ర్గత రహదారుల పరిస్థితి ఎలా ఉంటుందో అధికా రులకే ఎరుక. ఏళ్ల తరబడి ఇలాంటి ఈ తంతే కొనసాగుతున్నా తమ గోడు వినేవారే కనిపించ డం లేదనే విమర్శలు ప్రజలు, వాహనదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వంతెనలకు మరమ్మతులు చేపట్టి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం : మండలంలోని పెదపవనిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఎస్సై ఎం.బాజీబాబు, సిబ్బంది దాడులు చేసి ఉప్పుటేరులో ఇసుక నింపుకొని వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

కందుకూరులో టీడీపీ అభ్యర్థుల రోడ్‌షో!

కందుకూరు, ఏప్రిల్ 1 : తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కందుకూరు అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి మండలంలోని పలుకూరు గ్రామం నుంచి ఆయన ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించారు. గ్రామంలో ఎడ్లబండిపై రోడ్‌షో నిర్వహించి మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థులుగా బరిలో దిగుతున్న తమను గెలిపించటం ద్వారా చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో సింగరాయకొండ వద్దకు చేరుకున్న వేమిరెడ్డికి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మూడు పార్టీల ముఖ్యనేతలంతా మన స్వాగతం పలికి ర్యాలీగా పలుకూరుకు చేరుకున్నారు. గ్రామదేవత పోలేరమ్మ గుడిలో పూజలు అనంతరం వేమిరెడ్డి, ఇంటూరిలకు హారతులతో స్వాగతం పలికి ఎడ్లబండిపై తప్పెట్లు, మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నార్నెరోశయ్య, కొండలరావు, శ్రీనివాసరావు, వెంకటనరసింహ్మం, కూనం సుబ్బారెడ్డి, సుధాకర్, చిరంజీవిరెడ్డి, శ్రీనివాసరావు, మాలకొండయ్య, మాతయ్య, బాబూరావు, చంద్రయ్య, స్వర్ణ శ్రీను, షేక్ నాగూర్, తలారి మాలకొండయ్య, హరిబాబు, ఉన్నం భాస్కరరావు, మదన్ తదితరులు పాల్గొన్నారు.

పెదపట్టపుపాలెంలో ఆత్మీయ సమావేశం

ఉలవపాడు మండలం పెదపట్టపుపాలెం గ్రామస్థులతో టీడీపీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కందుకూరు అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులు సోమవారం సాయంత్రం ఆత్మీయ సమావేశంలో నిర్వహించారు. అంతకుముందు రెడ్డిపాలెం బస్టాండ్ సెంటర్‌లోనూ స్థానికులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు ఆవుల రఘు, నాయకులు ఆవుల సోమయ్య, కొండూరి జయరాం, ప్రళయకావేరి రామమూర్తి, పుల్లా వెంకట్, పుల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పెదపట్టపుపాలెం ఆత్మీయ సమావేశంలో వేమిరెడ్డి, ఇంటూరి

టీడీపీలో చేరిక

లింగసముద్రం : మండలంలోని ఆర్‌ఆర్ పాలెంకు చెందిన వైసీపీ నేత కిలారి మల్లికార్జున సోమవారం కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు అయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ టీడీపీ నేత కేతినేని మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



సమంతకు కేక్ తినిపిస్తున్న ఎంఈవో బాలకృష్ణారెడ్డి, శేషగిరిరావు

కలువాయి, ఏప్రిల్ 1: నవోదయ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించిన తెలుగురాయపురం పాఠశాల విద్యార్థి గుంజి సమంతను సోమవారం ఎంఈవో బాలకృష్ణారెడ్డి, ఎంఈవో-2 శేషగిరిరావు అభినందించారు. ఎంఈవో కార్యాలయంలో విద్యార్థినికి కేక్ కట్ చేసి తినిపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. జీవీ.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు ఆర్‌వీ కృష్ణారెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఉదయగిరి, ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలో ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్‌ప్రేమ్‌కుమార్ తెలిపారు. దీనికోసం 08620-293077 నెంబర్‌లో కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కాల్ సెంటర్ 24గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

అంగన్‌వాడీల నిర్వహణలో మార్పులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 1: వేసవి దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సమయాలను మార్పు చేసినట్లు సీడీపీవో పచ్చవ లావణ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 4 నుంచి మే 31వ తేదీ వరకు కేంద్రాలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే మే 1 నుంచి 15వరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు, 16 నుంచి 31వరకు ఆయాలకు వేసవి సెలవులు ఉంటాయన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 1: పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కె.రమేష్, రాజమోహన్, నరసింహులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు సోమవారం రూ.15వేల ప్రింటర్‌ను సోమవారం హెచ్‌ఎం సుబ్బారెడ్డికి అందేశారు. భవిష్యత్తులో విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు చేయూత ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఖాదర్‌బాషా, ప్రశాంతకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

సంగం, ఏప్రిల్ 1: దువ్వూరు, మర్రిపాడులో జనసేన నాయకులు నిరుపేద ఒంటరి వృద్ధులకు సోమవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. నెలరోజులకు సరిపడ బియ్యం, పప్పులు, నూనె అందచేశారు. అనంతరం పెరమనకు చెందిన కొంతమంది యువకులు పార్టీ మండలాధ్యక్షుడు రాకేష్‌యాదవ్ ఆధ్వర్యంలో జనసేనలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆ పార్టీ నిజయోజకరవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తరుపున సూపర్ సిక్స్ పతకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భాను కిరణ్, అనిల్ కుమార్, చదలవాడ హరీష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి బెంచీల వితరణ



ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన బెంచీలు

అనంతసాగరం, ఏప్రిల్ 1: స్థానిక పీహెచ్‌సీలో రోగుల సౌకర్యార్థం ఆత్మకూరుకు చెందిన వైద్యులు వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర ప్రజావైద్యశాల అధినేత ప్రణీత్ సోమవారం మూడు బెంచీలను వితరణగా ఇచ్చాడు. చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది ఆయనకు ప్రతేక ధన్యవాదాలు తెలిపారు.

జోరుగా టీడీపీ ఎన్నికల ప్రచారం



క్యాలెండర్, కరపత్రాలను పంపిణీ చేస్తున్న బూత్ లెవెల్ ఇన్‌చార్జ్‌లు

సీతారామపురం, ఏప్రిల్ 1: కోటవీధి, అల్లికవీధి, తోట వీధి, మైయిన్ బజార్ ప్రాంతాల్లో సోమవారం తెలుగుదేశం బూత్‌లెవెల్ ఇన్‌చార్జ్‌లు తోట మాల్యాద్రి, తోట మనోజ్, నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పార్టీ సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్లు, కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర భవిష్యత్తుకు సీఎంగా చంద్రబాబు నాయుడుని గెలిపించు కోవాలని కోరారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తోట నవీన్‌కుమార్, జగదీష్, తోట నరసింహులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయండి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 1: స్థానిక ఆల్‌ఖైర్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించే సీతారామపురం, ఉదయగిరి మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమనికి నెల్లూరు ఎంపీ, ఉదయగిరి అసెంబ్లీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్ హాజరవుతారన్నారు. వారివెంట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ చెంచలబాబు యాదవ్ తదితరులు పాల్గొంటారన్నారు.

తెలుగుదేశం కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం..!



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వింజమూరు, ఏప్రిల్ 1: వైసీపీ నాయకులు చేస్తున్న అరాచకాలకు తెలుగుదేశంద కార్యకర్తలు, నాయకులు బెదరని ధైర్యంతో ఉంటారని టీడీపీ మండల కన్వీనర్ గొంగటి రఘునాథ రెడ్డి తెలిపారు. కాటేపల్లి ఎంపీటీసీ సభ్యుడు పురుషోత్తం స్వగృహంలో మండల బోర్డు కన్వీనర్ వనిపెంట వెంకటసుబ్బారెడ్డిలతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ మారిన ఎంపీటీసీ సభ్యుడి దిష్టిబొమ్మను స్థానిక వైసీపీ నాయకులు తగలబెట్టడం దారుణమన్నారు. వైసీపీ నచ్చకపోవడం వలన పార్టీ మారాల్సి వచ్చిందని, దాన్ని వైసీపీ నాయకులు వేరే విధంగా ఊహించి దిష్టిబొమ్మను తగలబెట్టడం దారుణం అన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం మంచిదికాదని తెలిపారు. సమావేశంలో మాజీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, కృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, పెదరాఘవరెడ్డి, గంగిరెడ్డి, బీసీ సెల్ నాయకులు వేణుగో పాల్, కొండపల్లి వెంకటేశ్వరనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ గెలుపే లక్ష్యం

- ఎమ్మార్పీఎస్ నాయకులు

వింజమూరు, ఏప్రిల్ 1: పట్టణంలోని కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు పందిటి అంబేద్కర్ మాదిగ కాకర్ల సురేష్‌ని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబునాయుడు అంగీకారం తెలపడంతో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీఏ అభ్యర్థిని గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు మందా సుజాత, ఎమ్మార్పీఎస్ నాయకులు మోహన్‌రావు, సుధాకర్, కొండయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

మష్కూరియా దర్గాలో ఇఫ్తార్ విందు

అనంతసాగరం, ఏప్రిల్ 1: స్థానిక బస్టాండ్ సెంటర్ లో వెలసిన హజరత్ మష్కూర్ అలిషా ఖాదరీ దర్గాలో సోమవారం రంజాన్ ఉపవాసదీక్ష చేసిన ముస్లింలకు నిర్వాహకులు సానీసాహెబ్, మజీద్‌సాహెబ్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

1ఏటీకె1: ట్రాఫిక్ సమస్యలపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ట్రాఫిక్ సమస్యపై సీపీఎం నిరసన



ట్రాఫిక్ సమస్యలపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, ఏప్రిల్ 1: పట్టణంలో అర్థాంతరంగా నిలిపివేసిన రహదారులతో నిత్యం ట్రాఫిక్స్ సమస్య ఏర్పడుతుందని తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఫ్లెక్సీలు చేతపట్టి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వీధుల్లో తిరుగుతూ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కె డెవిడ్ రాజు మాట్లాడారు. రోడ్డు ఏర్పాటుకు బాధితులకు నష్ట పరిహారం ప్రకటించి ఇప్పటికీ చెల్లించక పోవడం విచారకరం అన్నారు. కార్యక్రమంలో జి.లక్ష్మీపతి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ సందాని, సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వరికుంటపాడు, ఏప్రిల్ 1: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఉదయగిరి సీఐ గిరిబాబు తెలిపారు. సోమవారం వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి, విరువూరు, పెద్దిరెడ్డిపల్లి, జీ.కొండారెడ్డిపల్లి గ్రామాల్లో బీఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతయ్య పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల తరలింపుపై చర్యలు శూన్యం



డ్రమ్ముల్లో తరలిస్తున్న కోడి వ్యర్థాలు

అనంతసాగరం: శంకరనగరం, రేవూరు, పాతదేవరా యపల్లి, గౌరవరం గ్రామాల్లో చేపల గుంతలు వెలిశాయి. చేపల దాణాగా చికెన్‌షాపుల్లో దొరికే కోళ్ల వ్యర్థాలను వేస్తూ పెంపకందారులు ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. సంబంధిత అధికారులు మామూళ్లకు తలొగ్గి ఈ వ్యాపారాన్ని పోత్సహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సోమ శిల, అనంతసాగరంతో పాటు బద్వేల్ చికెన్ షాపుల నుంచి కోళ్ల వ్యర్థాలను డ్రమ్ముల్లో నింపి వాహనాలతో తరలిస్తుండగా వాహనాలు వెళ్లే సమయంలో గ్రామాల వద్ద భరించలేని దుర్వాసనతో ప్రజ లు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ చేపలను బుచ్చి, నెల్లూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు.

కష్టపడి పనిచేసి విజయం సాధించాలి : బీద



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో రవిచంద్ర

అల్లూరు, ఏప్రిల్ 1 : ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పిలుపునిచ్చారు. అల్లూరు పట్టణ పరిధిలోని వినాయకనగర్‌లో ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ గతంలో ఇదే ప్రాంతంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి గెలుపు సాధించామన్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో గెలుస్తామని తేలిగ్గా తీసుకోవద్దని, శక్తికి మించి కష్టపడితేనే గెలుపు సాధ్యమన్నారు. ఎన్నికలలోపు ప్రతి ఓటరును పదిసార్లు కలిసి ఓటును అభ్యర్థించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమిరెడ్డి కోటారెడ్డి, బీద గిరిధర్, పలగాటి శ్రీనివాసులురెడ్డి, కొండూరు పాలుశెట్టి, నలగట్ల శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసుల రెడ్డి, అరగల రమణయ్య, మేడా శ్రీనివాసులు రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, బిట్రగుంట చైతన్యరెడ్డి, తిరువీధి అనూరాధ, బిట్రగుంట వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

70 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక : అల్లూరు పట్టణ పరిధిలోని హరిజనవాడ, తూర్పువీధి, మండలంలోని గ్రద్దగుంట, బోగోలు మండలం జువ్వలదిన్నె నుంచి దాదాపు 70 మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు, బీద రవిచంద్ర ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాను కప్పి స్వాగతించారు.

సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

- 22వ వార్డులో కావ్య ఎన్నికల ప్రచారం



22వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న క్రిష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 1: సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని కావలి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని వెంగళరావునగర్ 22వ వార్డులో సోమవారం సాయంత్రం స్థానిక వార్డు ఇన్‌చార్జి కుందుర్తి కిరణ్, క్లస్టర్ ఇన్‌చార్జి మన్నవ రవిచంద్ర ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రం గాడిలో పడాలన్నా, పాత సంక్షేమ పథకాలు ఆగకుండా, సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరాలన్నా చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న ప్రతాప్‌కుమార్ రెడ్డి అభివృద్ధిని విస్మరించి దొరికిన కాడికి దోచుకున్నారన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, టీడీపీ నేతలు ఇమ్రాన్, వసంతరావు, దేవరకొండ మధు, జనసేన నేత షమీ, బీజేపీ నేత ఉదయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎంను చేసుకుందాం : వంటేరు



బీకే అగ్రహారంలో పార్టీ నాయకులతో వంటేరు

జలదంకి, ఏప్రిల్ 1: అభివృద్ధికి మారుపేరైన చంద్రబాబునాయుడని రాష్ట్రానికి సీఎంను చేసుకోవడమే సంకల్పంగా ముందుకు సాగి ఎంపీ, ఎమ్మెల్యేలుగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కాకర్ల సురేష్‌లను గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అయ న మండలంలోని హనుమకొండపాలెం, బ్రాహ్మణక్రాక, 9వమైలు, బికె అగ్రహారం గ్రామాల్లో పర్యటించి పార్టీ నేతలు, సానుభూతిపరుల నివాసాలకు వెళ్లి టీడీపీ అభ్యర్థుల వి.యానికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ ఎంవీ రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ వంటేరు జయచంద్రారెడ్డి, నాయకులు మందపల్లి మాల్యాద్రియాదవ్, తెలుగుయువత రాష్ట్ర నేత గుర్రం ప్రవీణ్‌బాబు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి : సీపీఎం

కావలిటౌన్, ఏప్రిల్ 1: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో దోమలు పెరిగి కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయన్నారు. కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయడం, ఫాగింగ్ చేయడం లాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. కాలువలు శుభ్రం చేయక దోమలకు నిలయాలుగా మారి ప్రజలపై దాడి చేస్తుండడంతో సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు, చర్మ వ్యాధులు వ్యాపిస్తున్నాయన్నారు. అనేక ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగడం లేదన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మధుసూదన్‌రావు, తిరుపాల్, బోగిశెట్టి కృష్ణయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుంది : మాలేపాటి



స్థానికులతో మాట్లాడుతున్న మాలేపాటి

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 1: టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటుందని కావలి నియోజకవర్గ నేత మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తి మండలం కొత్తపల్లి కౌరుగుంట పంచాయతీ సున్నపుబట్టి, దళితవాడల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దళితవాడలోని ప్రధాన సమస్యలపై స్థానికులతో చర్చించారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగల్ల సుధాకర్, వల్లపు మల్లి, బెల్లంకొండ శీను, దశయ్య, హనుమతరావు, శ్రీహరినాయుడు, పులి శీనయ్య, కాంద్ర వెంకటేశ్వర్లు, వెంకన్నబాబు పాల్గొన్నారు.

వేమిరెడ్డి, ఇంటూరిలకు ఎమ్మార్పీఎస్ మద్దతు

కందుకూరు, ఏప్రిల్ 1: తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు ఇంటూరి నాగేశ్వరరావు, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు వర్ల దేవదాస్ మాదిగలు తెలిపారు. సోమవారం కందుకూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల కార్యకర్తలు రావినూతల ముత్తు, కిట్టు, రావినూతల బజాక్, వినయ్, తాటిపర్తి రవీంద్ర, సందీప్, సిహెచ్ శ్రీనాథ్, రవీంద్ర, జలదంకి రమేష్, గౌడపేరు అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం

కొండాపురం, ఏప్రిల్ 1: నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లు మంగళవారం విం.మూరులో టీడీపీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

5లోగా పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు, ఏప్రిల్ 1: పాలిటెక్నిక్‌లో ప్రవేశం కోసం నిర్వహించే పాలీసెట్‌కు అభ్యర్థులు ఈనెల 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.మస్తానయ్య తెలిపారు. పాలీసెట్‌కు హాజరుకాదలచిన విద్యార్థుల కోసం కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ ఉచిత శిక్షణ ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

లింగసముద్రం, ఏప్రిల్ 1 : మండలంలోని వెంగళాపురం, లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ బూతులను కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి సోమవారం పరిశీలించారు. ఇక్కడి వసతులను తహసీల్దారు జీ.శ్రీచరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ టీ.ప్రసాద్, వీఆర్వోలు షేక్ మస్తాన్‌వలి, కె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కంచర్ల రామయ్య జన్మదిన వేడుకలు

కందుకూరు, ఏప్రిల్ 1: ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆయనను ప్రత్యేకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలుపగా కళాశాల ఆవరణలో నర్సింగ్ విద్యార్థినులు, అధ్యాపకుల సమక్షంలో ఆయన కేకు కట్‌చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల అధ్యాపకులు, సిబ్బందికి విందు ఏర్పాటు చేశారు.

కూటమి గెలుపు రాష్ట్రానికి అనివార్యం

అల్లూరు, ఏప్రిల్ 1 : కూటమి గెలుపు రాష్ట్రానికి అనివార్యమని టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అల్లూరు వినాయకనగర్, ప్రధాన రహదారి, పాతబస్టాండు సెంటరు తదితర ప్రాంతాల్లో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి కోటారెడ్డి, వేమిరెడ్డి సందీప్‌రెడ్డి, వాకాటి బినీత్‌రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, ఊటు అశోక్‌రెడ్డి, బిట్రగుంట చైతన్యరెడ్డి, తిరువీధి అనూరాధ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల నుంచి ఫోన్లు, డివైజ్‌ల స్వాధీనం

లింగసముద్రం, ఏప్రిల్ 1 : భారత ఎన్నికల సంఘం పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం పెట్టాలని ఆదేశించిన నేపథ్యంలో మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న 187 మంది వలంటీర్ల నుంచి ఫోన్లు, డివైజ్‌లను స్వాధీనం చేసుకున్నామని ఎంపీడీవో యు శేషబాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి సచివాలయాల వద్దనే పింఛన్ పంపిణీ చేస్తామని చెప్పారు. లబ్ధిదారులు ఆధార్‌కార్డు లేదా పింఛను ఐడీ నంబరు తీసుకురావాలని చెప్పారు. పింఛను పుస్తకం తీసుకొని రావద్దని చెప్పారు.

ఆర్ఎస్ఆర్‌లో కార్నివాల్ 2కే 24

బిట్రగుంట, ఏప్రిల్ 1: బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కార్నివాల్ 2కే 24 పేరుతో యూత్ హంగామా నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన జ్యాక్ బాక్స్, ఫ్లవర్ స్టాల్, కాయిన్ ఇన్ ది బకెట్, హిట్ ది గ్లాస్, రింగ్ రాజా ఫుడ్ కోర్ట్, జ్యూస్ స్టాల్‌లను ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి, కార్నివాల్ కన్వీనర్ వీ.సునీల్‌రెడ్డి పరిశీలించారు. విద్యార్థుల వంటావార్పు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి ఆర్వీ రమణారెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో ఎవరూ చేరలేదు..

లింగసముద్రం, ఏప్రిల్ 1 : మండలంలోని విశ్వనాథపురంలో తెలుగుదేశం పార్టీకి చెందిన వారు ఎవరూ వైసీపీలో చేరలేదని ఆ గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఉన్నం రమేష్, సర్పంచు బొల్లినేని నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు ఉన్నం వీరాస్వామి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. గ్రామంలోని వైసీపీకి చెందిన వారికే కండువాలు వేసి వైసీపీలో చేరారని ప్రకటించడం సరికాదన్నారు.

పెన్షన్ పంపిణీపై అవగాహన

కలిగిరి, ఏప్రిల్ 1: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో రంగసుబ్బరాయుడు అవగాహన కల్పించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెన్షన్ లబ్ధిదారులకు నిర్ధేశిత మార్గదర్శకాల ప్రకారం పెన్షన్ పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు బాలకిషోర్, ఎస్ఐ సంతోష్‌కుమార్‌రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ప్రతి అధికారి పనిచేయాలని ఎంపీడీవో జమీఉల్లా అన్నారు. బోగోలు ఎంపీడీవో కార్యాలయంలో మండల, పంచాయతీ స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు వలంటీర్లు పెన్షన్ పంపిణీలో పాల్గొనవద్దని సూచించిన నేపథ్యంలో వారి నుంచి మొబైల్ ఫోన్, సిమ్‌కార్డు, ఫింగర్ ప్రింట్ స్కానర్ వంటి పరికరాలను పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలన్నారు. ప్రతి సచివాలయంలో 3వ తేదీ నుంచి పింఛన్ పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరత్నం, ఏవో గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చాం : ప్రశాంతిరెడ్డి



కోవూరు: ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రశాంతిరెడ్డి



కోవూరు: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నీలిమారెడ్డి

కోవూరు, ఏప్రిల్ 1: స్థానిక రైల్వే ఫీడర్సు రోడ్డులో టీడీపీ ఎన్నికల కార్యాలయాన్ని ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాయకులందరూ సమిష్టిగా కృషిచేసి పార్లమెంటు సెగ్మెంటుకు తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, కోవూరు అసెంబ్లీ అభ్యర్థిగా తనను గెలిపించాల్సిందిగా కోరారు. నియోజకవర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉంటామని, ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, నన్నపురెడ్డి వేణుగోపాలరెడ్డి, జెట్టి రాజగోపాలరెడ్డి, నాటకరాని వెంకట్, బాలరవి, వవ్వేటి మల్లిఖార్జునరెడ్డి, యాకసిరి వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోవూరులో ప్రశాంతిరెడ్డి కుమార్తె ప్రచారం

కోవూరు నియోజకవర్గ టీడీపీ శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి సోమవారం స్థానిక సత్రంవీధిలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబునాయుడును, నియోజకవర్గ అభివృద్ధి కోసం తన తల్లి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించాల్సిందిగా కోరారు. ఆమె వెంట టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, పిచ్చుక మధుసూదనరావు ఉన్నారు.

కొడవలూరు: కోవూరు అభివృద్ధి టీడీపీ శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యం అని టీడీపీ నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు బద్వేల్ వినీల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలో రెడ్డిపాలెం, ఆలూరుపాడు గ్రామాలలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరిగి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి మధుసూదన్, జి కృష్ణయ్య, మల్లికార్జున, వినీత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు: వేమిరెడ్డి దంపతుల విజయం తథ్యమని, వైసీపీ నాయకులు ఎన్ని కుట్రలు చేసినా అపలేరని మండల కోఆప్షన్ మెంబరు ఎస్‌కె రఫీ అన్నారు. వేమిరెడ్డి దంపతులకు మద్దతుగా ముదివర్తి గ్రామంలోని గిరిజన కాలనీల్లో సోమవారం అయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శరత్‌చంద్ర, నాయకులు నన్నం శేషయ్య, మాధవి, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను గెలిపించుకుంటే జిల్లాతోపాటు కోవూరు నియోజకవర్గానికి మహర్దశ పడుతుందని చెల్లాయపాళెం టీడీపీ నాయకుడు దండు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన చెల్లాయపాళెంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచారం చేసి ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకసిరి మణి, గోపాల్, కదురు ప్రభాకర్‌తోపాటు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి సోమవారం 1000 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని టీడీపీ నాయకులు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, నూరా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ నుంచి రేబాల గ్రామ సర్పంచు లఘుంతోటి భాగ్యలక్ష్మి, చెల్లాయపాళెం సర్పంచు రావూరి రజనీకాంత్, ఉప సర్పంచు రొండ్ల ఈశ్వరి, నాగమాంబాపురం సర్పంచు రామచంద్రా రెడ్డి, బుచ్చి 1వ వార్డు మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మి, పెనుబల్లి సర్పంచు వూడా పెంచలయ్య, వార్డు మెంబర్లు ఎ సుబ్బయ్య, సునీత, పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వేమిరెడ్డి దంపతుల నిస్వార్థ సేవలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు ముక్తకంఠంతో పేర్కొన్నారు.

గంధ మహోత్సవంలో..

మండలంలోని పంచేడు గ్రామ పంచాయతీ పరిధిలోని హజరత్ మౌలా అలీ షెహెరే ఖుదా గంధ మహోత్సవంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ముందుగా వారికి దర్గా నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం వారి పేరుతో దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందజేశారు. వారి వెంట నాయకులు నూరా శ్రీనివాసులురెడ్డి, మండలంలోని టీడీపీ నాయకులు వున్నారు.

ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు పంచాయతీ పాములవారి పాలెం, బీసీ, గిరిజన కాలనీలలో టీడీపీ మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్రచౌదరి ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మునగాల రంగారావు, కైలాసం ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకాణి నుంచి సర్వేపల్లిని కాపాడుకోవాలి : సోమిరెడ్డి

వెంకటాచలం, ఏప్రిల్ 1: వైసీపీ రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని, మంత్రి కాకాణి దౌర్జన్యాల నుంచి సర్వేపల్లి నియోజకవర్గాన్ని కాపాడుకోవాలని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని కసుమూరు పంచా యతీ చింతలపాళెం గ్రామంలో సోమవారం సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఆ యన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లల్లో కనుపూరు, సర్వేపల్లి రిజర్వాయర్, చెరువులు, కొండ లు, తిప్పలు, ప్రభుత్వ భూములు కొల్లగొట్టి గ్రావెల్‌ను దోచుకొని వందల కోట్లు సంపాదించుకున్నారని, కార్యక్రమంలో గుమ్మడి రాజాయాదవ్, బొమ్మి సురేంద్ర, కుంచి శ్రీనివాసులు యాదవ్, అల్లూరు ప్రసాద్‌నాయుడు, బొబ్బేపల్లి సురేష్‌నాయుడు, తదితరులున్నారు.



తనయుడితో కలిసి ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు

అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తాం

మనుబోలు: టీడీపీ అధికారంలోకి రాగానే మనుబోలు పంచాయతీలో పేరుకుపోయిన సమస్యలన్నింటీని పరిష్కరిస్తామని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోడలు శృతిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆమె విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి తన మామను గెలిపించాలని, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, దండు చంద్రశేఖర్‌రెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, జన సేన అధ్యక్షుడు పెనుబాక ప్రసాద్, బీజేపీ అధ్యక్షుడు పి.వి. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి 40 కుటుంబాలు టీడీపీలో చేరిక

తోటపల్లిగూడూరు: మండలంలోని మండపం పంచాయతీ పరిధిలో ఉన్న చంద్రశేఖరపురం, గొల్లపాలెంలో సోమవారం స్థానిక టీడీపీ నాయకుడు తాండ్ర మునికృష్ణ ఆధ్వర్యంలో వైసీపీని వీడి సుమారు 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, ముద్దా శ్రీహరి, తాండ్ర మల్లికార్జున, ఉప్పల శ్రీనివాసులు, జడపల్లి వెంకటేష్, మండల వివిధ గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి

మనుబోలు, ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలకేంద్రమైన మనుబోలులో సోమవారం సీఐఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. జవాన్లతో పాటు మనుబోలు సివిల్ పోలీసులు, పొదలకూరు సీఐ రాంబాబు పాల్గొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 1: మండలంలోని తోటపల్లి, తోటపల్లిగూడూరు, ఇసుకపాలెం పంచాయతీల్లో సోమవారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో నాయకులు శంకరయ్యగౌడ్, సుబ్రహ్మణ్యం గౌడ్, శేసమ్మ, శ్రీనివాసులు, ఈదూరు రామాచార్యులు, వివిధ గ్రామాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఇందుకూరుపేట, ఏప్రిల్ 1: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంస) ఇందుకూరుపేట తాలూకా నూతన కార్యవర్గం ఎన్నిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆరోగ్యశాఖ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అరికొండ హరిబాబు, హంస మహిళా రాష్ట్ర విభాగం గౌరవ చైర్మన్ ఆర్ ఇందిర, జనరల్ సెక్రటరీ కల్లం శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథులు డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ సునీల్, సబ్ ట్రెజరీ అధికారి వి రమణారావు నేతృత్వంలో తాలూకా అధ్యక్షురాలుగా జి అరుణారాణి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఏవీ రమేష్, జనరల్ సెక్రటరీగా కె.వరలక్ష్మీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్‌గా కె శారమ్మ, సుశీలమ్మ, ఖాదర్‌బాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందుకూరుపేట హంస తాలూకా యూనిట్ గౌరవ సలహాదారులుగా బి విజయమ్మ, ప్రపుల్లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ రిటైర్డ్ ఎంప్లాయిస్ జిల్లా నాయకులు ఖాదర్‌బాషా, హంస జిల్లా గౌరవ సలహాదారు అరవ పరిమళ, సీహెచ్‌ఓ అసోసియేషన్ నాయకులు, 104 ఉద్యోగ సంఘం నాయకులు, అధికారులు, ఉద్యోగులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

అక్రమాల మయం.. పక్కాగృహాల నిర్మాణం

లబ్ధిదారుడి నుంచి రూ.10వేల నుంచి 30వేల వరకు వసూలు

పొదలకూరు, ఏప్రిల్ 1: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పక్కాగృహాల నిర్మాణం అక్రమాల మయంగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి నెలల మధ్య మంజూరైన, చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి భారీఎత్తున అవినీతి చోటుచేసుకున్నట్లు, ఇందులో ఓ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కీలక పాత్ర పోషించినట్లు మండలవాసులు ఆరోపిస్తున్నారు. మండలంలోని నిజమైన లబ్ధిదారులకు ఇళ్లు అందలేదు కానీ అధికారులు ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్లు కట్టకుండానే, ఎప్పుడో కట్టుకున్న పాత ఇళ్లకు మొత్తం డబ్బులు ఖాతాలో జమ అయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని చాటగొట్ల, మొగళ్లూరు, మరుపూరు, తోడేరు, బిరదవోలు, తాటిపర్తి, అయ్యగారిపాలెం, పొదలకూరు బిట్- 2, 3, పొదలకూరు బిట్-4 సచివాలయాల పరిధిలోని కొన్ని పక్కాగృహాల నిర్మాణాల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందని, ఇళ్లకు సంబంధించిన బిల్లులు మంజూరు కాగానే ప్రధాన భాగం తిరిగి దక్షిణ రూపంలో అధికారులకు చేరాయని, ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షల నుంచి రూ.1.80 లక్షలు మంజూరు కాగా, ఒక్కో ఇంటికి రూ.10వేల నుంచి రూ.30వేల వరకు వసూలుచేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హౌసింగ్ శాఖలో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేకూరేలా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.



పొదలకూరు హౌసింగ్ కార్యాలయం

బృందావనలోలా... గోవిందా!

● స్మరణోత్సవాల్లో మురళి గానామృతం



గాత్ర కచేరీ చేస్తున్న సంగీత విద్వాంసుడు మురళి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 1 : ప్రముఖ సంగీత విద్వాంసుడు, చెన్నైకు చెందిన ఏఎస్ మురళి గానామృతం సంగీత ప్రియులను ఓలలాడించింది. భిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో నెల్లూరు టౌనుహాలులో జరుగుతున్న 59వ త్యాగరాజ స్వామి స్మరణోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం సీతారామ లక్ష్మణ హనుమ సహిత త్యాగరాజ స్వామి వార్లకు పూజలు జరిగాయి. అనంతరం పారాయతం నారాయణరావు భగవతార్ సతీ సుకన్య హరికథ గానం చేశారు. ఆయనకు బీ కృష్ణమూర్తి, శాంతికుమార్ వాద్య సహకా రం అందించారు. మధ్యాహ్నం కట్టాజీజి నారాయణరావు భాగవతార్ మహారథి కర్ణ హరికథను గానం చేశారు. ఆయనకు పసుమర్తి హరనాథరావు, యం ఈశ్వరమ్మలు వాయిద్య సహకారం అందించారు. సాయంత్రం నగరానికి చెందిన గాయకులు త్యాగరాజస్వామి పంచరత్న కృతులను ఆలపించారు. అనంతరం జరిగిన మురళి బృందం కచేరీ ఆకట్టుకుంది. వయోలిన్ వీవీ శ్రీనివాసరావు, మృదంగం ఎన్ స్కంద సుబ్రహ్మణ్యం, మోర్సింగ్ ఏఎస్ కృష్ణ, గాత్ర సహకారాన్ని ఆర్ శ్యామసుందర్ అందజేశారు.

ఇంతియాజ్ మద్దతు హర్షణీయం

టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 1 : నగరంలోని మదీనా వాచ్ షోరూమ్ అధినేత ఇంతియాజ్ తమకు అండగా నిలబడి, ఎన్నికల్లో తమను గెలిపిస్తానని చెప్పడం ఆనందంగా ఉందని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం ఇంతియాజ్ నివాసంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు నారాయణ, వేమిరెడ్డి, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు బ్రాండ్‌గా గు ర్తింపు పొందిన మదీనా వాచ్ యజమాని ఇంతి యాజ్, మైనార్టీలు మద్దతు పలకడం శుభపరిణా మమన్నారు.



ఇఫ్తార్ విందులో నారాయణ, వేమిరెడ్డి తదితరులు

● పొంగూరు నారాయణ 3వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం, ర్యాలీ నిర్వహించారు. ఆయన సతీమణి రమాదేవి 52, 48 డివిజన్లలో పర్యటించారు. ఎమ్మెల్యేగా నారాయణను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. నారాయణ కుమార్తె శరణి 8, 10 డివిజన్లలో పర్యటించారు.

వీపీఆర్ దంపతుల విజయానికి కృషి

● మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి



నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 1 : తెలుగుదేశం పార్టీ నిర్ణయం.. చంద్రబాబు ఆదేశాలే తమకు శిరోధార్యమని, కుల దైవం వేంకటేశ్వర స్వామి సాక్షిగా ఎన్నికల్లో వీపీఆర్ దంపతుల విజయం కోసం శాయశక్తులా కృషి చేస్తానని కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి స్పష్టం చేశారు. సోమవారం అయన నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొద్ది రోజులుగా ప్రజలు, సన్నిహితులు, అభిమానుల్లో కొన్ని అపోహలు, ఆరోపణలు నెలకొన్నాయని విని మనస్థాపానికి గురయ్యాయని చెప్పారు. వాటికి సమాధానం చెప్పేందుకే మీడియా ముందుకు వచ్చానన్నారు. ఎన్నికల్లో టికెట్టు ఇవ్వకపోవడంపై చంద్రబాబు తమకు స్పష్టంగా వివరించారని, భవిష్యత్తులో మంచి జరుగుతుందని భరోసా కల్పించారని చెప్పారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి గెలుపుతోపాటు చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. దినేష్‌రెడ్డి రెండేళ్లుగా ప్రజల్లో ఉంటూ కష్టపడి పనిచేస్తున్నారని, అదే స్ఫూర్తితో ముందుకు సాగుతారని తెలిపారు.

విజయసాయిరెడ్డిని తరిమికొట్టండి : కోటంరెడ్డి



ఇంటింటి ప్రచారంలో కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఏప్రి ల్ 1 : విశాఖపట్టణాన్ని దోచుకున్న విజయసాయి రెడ్డిని నెల్లూరు ప్రజలు తరిమి కొట్టాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని 11వ డివిజన్‌లో ఆయన సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. విజయసాయి గెలిపిస్తే ప్రశాంతమైన నెల్లూరు జిల్లాలో నేరాలు, ఘోరాలు అధికమవుతాయన్నారు. అభివృద్ధికి కృషి చేసే నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు వీడ్కోలు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 1: పోలీసుశాఖలో ఉద్యోగ విరమణ పొందిన ఏవో విజయకుమార్, ఏఆర్ హెచ్‌సీ వెంకటేశ్వర్లు, హోంగార్డు గౌరీమోహన్‌ను సోమవారం నగరంలోని ఉమేష్ చంద్ర సమావేశం మందిరంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం జరిగింది. వారికి ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి ఘనంగా సత్కరించారు. శేషజీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఎప్పుడు ఏ అవసరమున్నా తనను నేరుగా సంప్రదిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన వారితో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

ఫిడే ఇంటర్నేషనల్ మాస్టర్‌గా రామ్‌లిఖిత్

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 1 : ఫిడే ఎరీనా ఇంటర్నేషనల్ మాస్టర్ చెస్ టైటిల్‌ను నెల్లూరుకు చెందిన రామ్‌లిఖిత్ సొంతం చేసుకున్నాడు. నగరంలోని రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై సుమన్ మాట్లాడారు. నగరంలోని భాష్యం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న లిఖిత్ ఫిడే ఎరీనా ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్ సాధించాడని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోచ్ ప్రదీప్, తల్లిదండ్రులు దుర్గ, రాజేష్, అసోసియేషన్ సభ్యులు ఎస్ వెంకటేష్, అర్జున్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారుడిని అభినందిస్తున్న సుమన్

మెమోకు వివరణ ఏదీ!?

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగిపై డీఐజీకి ఫిర్యాదు
- వివరణ ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్ మెమో జారీ
- గడువు ముగిసినా బేఖాతర్.. తదుపరి చర్యలపై ఉత్కంఠ

నెల్లూరు (హరనాథపురం) : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసులు, దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన తిరుపతిరెడ్డితో అగౌరవంగా మాట్లాడినందుకు డీఐజీ కిరణ్‌కుమార్ ఆదేశాలతో జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు మెమో ఇచ్చారు. గడువు ముగిసినా సీనియర్ అసిస్టెంట్ ఇంతవరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. కాగా, నగరానికి చెందిన తిరుపతిరెడ్డి భూమి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసుల వద్దకు వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్ ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చోవడంతో సీనియర్ అసిస్టెంట్ అగౌరవంగా మాట్లాడినట్లు తెలిసింది. అంతేగాక, ఆ కుర్చీలో నుంచి తిరుపతి రెడ్డి లేచి నిలబడి ఫోన్ మాట్లాడుతుండగా బయటకు వెళ్లండంటూ అగౌరవంగా మాట్లాడినట్లు, భూమి రిజిస్ట్రేషన్ కోసం కొంత నగదు ఇవ్వాలని డిమాండ్ జారీ చేసినట్లు తెలిసింది. అక్కడ జరిగిన పరిణామాలన్నీ రికార్డు చేసి తిరుపతిరెడ్డి డీఐజీ దృష్టికి తీసుకెళ్లడంతో శ్రీనివాసులుకు మెమో ఇచ్చి వివరణ కోరాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. దీంతో జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసులుకు గత నెల 25వ తేదీన మెమో ఇచ్చారు. అయితే గడువు ముగిసి 3 రోజులైన సంబంధిత ఉద్యోగి నుంచి ఎలాంటి వివరణ అందనట్లు సమాచారం. ఈ విషయమై స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తిరుపతి రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు మెమో ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించామన్నారు. ఆ మెమోకు సీనియర్ అసిస్టెంట్ జవాబు ఇవ్వగానే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే, మెమోకు వివరణ ఇవ్వకపోవడంతో సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసులుపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోననే ఉత్కంఠ నెలకొంది.

విశ్రాంత ఉద్యోగులకు 4న కంటి వైద్య శిబిరం

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 1 : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ఈనెల 4వతేదీన టౌన్‌హాల్లో కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ సుధాకర్ పరీక్షలు చేస్తారన్నారు. ఈహెచ్‌ఎస్, ఆరోగ్యకార్డులు ఉన్నవారికి ఉచితంగా కంటికి శుక్లాల ఆపరేషన్ చేస్తారని తెలిపారు. జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూరల్ టీడీపీలో చేరికలు



పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 1 : నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన వారు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో ఆయన కార్యాలయంలో పసుపు కండువా కప్పుకున్నారు. కొత్తవెల్లంటి గ్రామానికి చెందిన వైసీపీ నేత అంజయ్య సాహెబ్, నగరంలోని 28వ డివిజన్ పోస్టల్ కాలనీకి చెందిన పలువురు పార్టీలో చేరారు. కాగా, కోటంరెడ్డి కుటుంబ సభ్యులు 41వ డివిజన్ మనుమసిద్ధినగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి



ఎన్నికల ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న వినోద్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 1: ముస్లింల అభ్యున్నతికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నారాయణ పాటుపడుతారని టీడీపీ నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తెలిపారు. నగరంలోని 52వ డివిజన్‌లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వంలో మాదిరి వైసీపీ పాలనలో ముస్లింల అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. దుల్హన్ వంటి పథకాల్లోనూ ప్రస్తుత ప్రభుత్వం కోత విధించిందని విమర్శించారు.

5లోగా పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు, ఏప్రిల్ 1: పాలిటెక్నిక్‌లో ప్రవేశం కోసం నిర్వహించే పాలీసెట్‌కు అభ్యర్థులు ఈనెల 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.మస్తానయ్య తెలిపారు. పాలీసెట్‌కు హాజరుకాదలచిన విద్యార్థుల కోసం కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ ఉచిత శిక్షణ ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని తెలిపారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 2 ఏప్రిల్ 2024

ఆరణిని గెలిపిస్తాం

తిరుపతి సీటును బాబుకు కానుకగా ఇస్తాం

టీడీపీ ఇన్‌ఛార్జి సుగుణమ్మ ప్రకటన

కుటుంబ సభ్యులు, పార్టీ నేతలతో కలిసిన ఆరణి

తిరుపతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : "చంద్రబాబు సీఎం కావడమే మా లక్ష్యం. సీఎంగా అసెంబ్లీకి వస్తానని ఆయన శపథం చేశారు. ఆ శపథం నెరవేరేలా పనిచేస్తాం. ఆయన ఆదేశాలకు అనుగుణంగా తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును గెలిపించి చంద్రబాబుకు తిరుపతిని కానుకగా ఇస్తాం." అని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రకటించారు. సోమవారం జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు (జేఎంసీ) తన కుటుంబ సభ్యులు, జనసేన పార్టీ నాయకులతో కలిసి టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ నివాసానికి వెళ్లారు. దాదాపు అరగంటకు పైగా రెండు కుటుంబాలు ఏకాంతంగా మాట్లాడుకున్నాయి. అనంతరం మీడియాతో సుగుణమ్మ మాట్లాడారు. జనసేన- టీడీపీ- బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ టీడీపీలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు సద్దుమణిగాయని చెప్పారు. జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలను, నాయకులను కుటుంబ సభ్యులుగా చూసుకుంటానని తెలియజేశారు. గత ఐదేళ్లుగా తిరుపతిలో సుగుణమ్మ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేశారని, వైసీపీ ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి, వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డి తిరుపతి ప్రజలను వేధించారన్నారు. వైసీపీ నేతలు తిరుపతిని లూటీ చేశారని, టీడీఆర్ బాండ్లలో నిజమైన బాధితులకు న్యాయం చేస్తామన్నారు.తిరుపతిలో గంజాయి అమ్మకాలను అరికడతామని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ నాయకులు భట్టే వెంకట కీర్తి, చిట్టిబాబు, దంపూరి భాస్కర్, బుల్లెట్ రమణ, కృష్ణ యాదవ్, కంకణాల రజనీకాంత్ నాయుడు, రుద్రకోటి సదాశివం, బ్యాంకు శాంతమ్మ, ఆముదాల తులసీరాం, కొట్టే హేమంత్ రాయల్, ఆర్సీ శ్రీనివాస్, మునిరామయ్య, గోళ్ల లోకేశ్ నాయుడు, విశ్వనాథం, కరాటే చంద్ర తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశంతో సుగుణమ్మ దాదాపుగా అలక వీడారని భావిస్తున్నారు.చంద్రబాబు రేణిగుంటలో తిరుపతి నేతలతో మాట్లాడిన తర్వాత వీరు చల్లబడ్డారని తెలుస్తోంది.



ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు పసుపు కండువాను కప్పుతున్న సుగుణమ్మ

పింఛన్ల పంపిణీలో ఆలస్యమా?

ఎమ్మెల్యే ఆదిమూలం మౌనదీక్ష



టీడీపీ నేతలతో కలిసి మౌనదీక్ష చేస్తున్న ఆదిమూలం

నారాయణవనం, ఏప్రిల్ 1 : సామాజిక పెన్షన్ల పంపిణీలో ఆలస్యంపై నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం మౌనదీక్ష చేపట్టారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కూడా అయిన ఆదిమూలం నారాయణవనంలో పార్టీ నేతలతో కలిసి సాయంత్రం గంట సేపు దీక్ష చేపట్టారు.నగదు లోటు కారణంగానే పెన్షన్లు పంపిణీ చేయలేదని, అయితే జగన్, వైసీపీ నాయకులు కావాలనే టీడీపీ పైన బురదచల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.సచివాలయ సిబ్బంది ద్వారా వెంటనే పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు చేర్చాలని ఆదిమూలం డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు ఆర్డీ ఏకాంబరం, భాస్కరన్, గోవిందస్వామి, శివకుమార్, కేఎస్ రవి, గోవిందశెట్టి, రమేష్, సురేష్, విజయ్‌కుమార్, జయచంద్ర నాయుడు, కందస్వామి నాయుడు, వాసు, మల్లికార్జున రెడ్డి, మాణిక్యం రెడ్డి, రవిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నాక్ సభ్యురాలిగా నారాయణమ్మ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1: యూజీసీ నాక్ పీర్ టీంలో సభ్యురాలిగా పద్మావతీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణమ్మ నియమితులయ్యారు. ఉన్నత విద్యా సంస్థల్లోని నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి నాక్ గ్రేడింగ్ ప్రకటించే ప్రక్రియలో ఈమె భాగస్వామ్యం వహిస్తారు. టీటీడీ విద్యా సంస్థలకు సంబంధించి నాక్ పీర్ టీంకు ఎన్నికైన మొదటి వ్యక్తి ఆమే కావడం గమనార్హం. కామర్స్ అధ్యాపకురాలైన నారాయణమ్మ హాస్టల్ వార్డెన్‌గా, ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ప్రభుత్వం నుంచి ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ వి.కృష్ణవేణి, పలువురు అధ్యాపకులు ఆమెను అభినందించారు.

రైలు కిందపడి టీచర్ మృతి



కృష్ణప్రసాద్ (ఫైల్‌ఫొటో)

గూడూరు, ఏప్రిల్ 1: రైలు దిగుతుండగా కాలుజారి పడి ఓ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన గూడూరు రైల్వేస్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే జీఆర్ పోలీసుల కథనం మేరకు... నెల్లూరులోని హరినాథపురంలో నివాసం వుంటున్న కృష్ణ ప్రసాద్(42) గూడూరు మండలం వెందోడు ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రోజూ నెల్లూరు నుంచి పాఠశాలకు వచ్చి వెళ్తుంటారు. సోమవారం నెల్లూరు నుంచి బిట్రగుంట - చెన్నై మెమో రైలులో గూడూరుకు వచ్చారు. మూడో నంబరు ఫ్లాట్‌ఫాంపై ఆగేందుకు రైలు నెమ్మదిగా వెళ్తుండగా కృష్ణప్రసాద్ కిందకు దిగబోయాడు. ఆ సమయంలో కాలుజారి రైలుకింద పడడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కాళంగినదిలో పడి యువకుడి మృతి

తడ, ఏప్రిల్ 1: స్నేహితులతో కలసి నదిలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు నీట మునిగి మృతి చెందాడు.తడ మండల పరిధిలోని గ్రద్దగుంట దళితవాడకు చెందిన కుప్పంపాటి వెంకయ్య(28) శుక్రవారం మధ్యాహ్న సమయంలో నలుగురు మత్స్యకారులతో కలసి కాళంగినది వద్దకు వెళ్లాడు.అందరూ కలసి మద్యం సేవించి భోంచేశారు. స్నేహితులు నదిలో వలలు కట్టుకునే పనిలో ఉండగా వెంకయ్య నదిలోకి దిగి నీట మునిగిపోయాడు. స్నేహితులు అది గమనించకుండా వెళ్లిపోయారు. ఆదివారం సాయంత్రం కుటుంబసభ్యులు వెంకయ్య కోసం గాలిస్తుండగా తమతో పాటు వచ్చాడని, ఆ తరువాత కనబడలేదని స్నేహితులు చెప్పారు. దీంతో అందరూ కలసి నదివద్దకు వెళ్లి చూడగా మృతదేహం తేలుతూ కనిపించింది. వెంకయ్య మృతిపై అనుమానాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ శివప్రసాద్ ఆదాయ వనరులపై ఐటీ దృష్టి

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 1 : రేణిగుంట మాజీ తహసీల్దార్ శివప్రసాద్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని అవినీతి నిరోధక శాఖ తనిఖీల్లో బయటపడడంతో ఆదాయ పన్ను శాఖ దృష్టి సారించింది. పన్నుల చెల్లింపునకు సంబంధించి వివరాలు ఆరా తీస్తోంది. తిరుపతి, పీలేరులో ఆయన కూడబెట్టిన ఆస్తులు, భార్య డాక్టర్ కావడంతో ఆమె ఆదాయ వనరులపైనా దృష్టి సారించింది. అధికారిక లెక్కల ప్రకారం రూ.100కు 30 శాతం ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇలా దాదాపు రూ.70 కోట్లకు రూ.21 కోట్లు ఆదాయ పన్ను చెల్లించాల్సి ఉంది. ఆ మేరకు చెల్లింపులు జరిగాయా లేదా అనేది చూస్తున్నారు.

సిలబస్ మార్పు చేర్పులపై రేపు తిరుపతిలో సమావేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 1: నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) - 2020 ప్రకారం సిలబస్‌లో మార్పు చేర్పులపై ఈనెల 3వ తేదీన తిరుపతిలో సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈ సమావేశం చేపట్టనున్నారు. తొమ్మిది సైన్స్, నాలుగు ఆర్ట్స్ కోర్సులకు సంబంధించిన సిలబస్ రూపకల్పన బాధ్యతను ఉన్నత విద్యా మండలి ఈ దఫా పద్మావతి వర్సిటీ, యోగి వేమన వర్సిటీలకు అప్పగించింది. ఇరు వర్సిటీల అధికారులు, బీఓఎస్ ఛైర్మన్లు, అకడమిక్ వ్యవహారాల అధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు. మార్పు చేర్పులపై ఉన్నత విద్యా మండలికి నివేదించనున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం) : సా. 6.28

సహరి (బుధవారం) : ఉ. 4.48

పక్కా లోకల్...!

- ప్రశ్నార్థకంగా రక్షకభటుల బదిలీలు
- అధికారులకే పరిమితమైన ఎన్నికల కోడ్
- దశాబ్దాలుగా సొంత ప్రాంతాల్లో సిబ్బంది తిష్ఠ
- ఎన్నికల సమయంలో ప్రభావితం చేసే అవకాశం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1 : పోలీసు శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది చాలా చోట్ల దశాబ్దాలుగా ఒకే చోట పాతుకుపోయారు.వారిలో కొందరు రాజకీయ పార్టీలకు దాసోహం అయిపోయారు. ఎస్‌ఐ పైస్థాయి అధికారులు మాత్రమే కాలపరిమితి ముగిసిన తర్వాత బదిలీ అవుతున్నారు.హోంగార్డు నుంచి ఏఎస్‌ఐ వరకూ నిబంధనల ప్రకారం బదిలీ కావడం లేదు. ఎన్నికల కోడ్ సమయంలో తప్పనిసరిగా మూడేళ్ల కాల పరిమితి నిండిన అధికారులను బదిలీతో జిల్లా దాటిస్తుంటారు. క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం చాలామంది సంవత్సరాల తరబడి సొంత ప్రాంతాల్లో రకరకాల కారణాలతో కొనసాగుతుండడంపై ప్రతిపక్ష పార్టీల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

శాంతిభద్రతల పరిరక్షణలో రక్షకభటుల పాత్ర ఎంత కీలకమైనదో అందరికీ తెలిసిందే. ప్రధానంగా ఎన్నికల సమయాల్లో నిష్పక్షపాతంగా భద్రతా వ్యవస్థ వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఉద్దేశంతోనే ఎస్‌ఐ స్థాయి నుంచి అధికారులకు తరచూ స్థానచలనం కల్పిస్తుంటారు. ఇక ఎన్నికల కోడ్ సమయంలో అధికారుల బదిలీలు తప్పనిసరిగా జరిగి తీరుతుంటాయి. అయితే పోలీసు శాఖలో కిందిస్థాయి సిబ్బంది చాలామంది ఎక్కడివారు అక్కడే రాజకీయ బలంతో పాతుకుపోయారు. వాస్తవానికి సొంత మండలంలో, సబ్ డివిజన్ పరిధిలో ఒక కానిస్టేబుల్‌కు ఎప్పుడూ విధులు కేటాయించకూడదు. కానీ జిల్లావ్యాప్తంగా చాలామంది కానిస్టేబుళ్లు సొంత మండలాల్లోనే దశాబ్దాలుగా గడిపేస్తున్నారు. ఒకే సబ్ డివిజన్ పరిధిలో ఇలా 28 ఏళ్లుగా పనిచేస్తున్న వారు కూడా ఉండడం గమనార్హం. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఒకే డివిజన్‌లో పోలీస్ స్టేషన్లు మారుతూ రింగ్ మాస్టర్లుగా అక్కడే తిరుగుతున్నారు. శ్రీకాళహస్తిలో అలాగే చాలామంది రిటైరయ్యారు కూడా.ఇదిలా ఉండగా కొందరు వేరే సబ్ డివిజన్‌కు బదిలీ అయిన తర్వాత కూడా ఎస్పీ స్థాయి అధికారి ఇచ్చే అటాచ్మెంట్(డిప్యుటేషన్)తో వారికి కావాల్సిన స్థానాల్లో కొలువుదీరిపోయారు.తిరుపతి జిల్లాలో ఇలాంటి వారు 40శాతం దాకా వున్నారని సమాచారం. ఒక శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో సుమారు 50మంది దశాబ్దాలుగా సొంత స్థావరం లోనే అటూ ఇటూ తిరుగుతున్నారు.సొంత స్థావరాల్లో క్షేత్రస్థాయి రక్షకబటులు వేళ్లూనుకుపోవడంతో అధికారులకు తలనొప్పులు తప్పడం లేదు. బయట ప్రాంతం నుంచి వచ్చిన అధికారులు స్టేషన్లో పాతుకు పోయిన సిబ్బందిని గట్టిగా ఆదేశించి విధులు కేటాయించలేకపోతున్నారు.పలు సందర్భాల్లో అధికారుల పైనే స్థానిక బలంతో సిబ్బంది తిరగబడిన ఘటనలు న్నాయి.శాంతిభద్రతల సమస్యలు ఎదురైనా, అలాగే ఫిర్యాదులు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమయాల్లోనూ క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. పోలీసులు స్థానికులు కావడంతో గట్టిగా ఆకతాయిలను కూడా మందలించలేకపోతున్నారు. అన్నీ తెలిసినా నాన్ లోకల్ భయంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నట్లు తరచూ వాపోతుంటారు. ఇటీవల శ్రీకాళహస్తిలోని ఒక స్టేషన్లో జరిగిన ఘటన అందరినీ విస్మయానికి గురి చేసింది. ఒక సీఐ తమ శాఖ ఉన్నతాధికారి ముక్కంటి ఆలయానికి వచ్చిన సమాచారం తనకు ఎందుకు చెప్పలేదని కానిస్టేబుల్‌ను ప్రశ్నించాడు. దీంతో ఆ కానిస్టేబుల్ పోలీస్ స్టేషన్లో సిబ్బంది చూస్తుండగానే సీఐకి దురుసుగా సమాధానం ఇచ్చాడు. దాంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది.అంత జరిగినా ఆ అధికారి ఎవరికీ చెప్పుకోలేక లోలోపల మధనపడుతూనే తరువాత బదిలీపై వెళ్లిపోయాడు. ఇక వివాదాలు, ఆరోపణలు ఎదుర్కొన్న ఎందరో సిబ్బంది తమ రాజకీయ బలంతో ఏడాది కూడా తిరగకముందే తిరిగి అదే స్టేషన్లో పోస్టింగ్ పొందుతున్నారు.ఇక ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బంది తీవ్ర ప్రభావితం చేసే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

ఇటీవల పోలీస్ స్టేషన్లో కొత్త అధికారులు కొలువుదీరారు.వారు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్న ఉద్దేశంతో ఏ నిర్ణయం తీసుకున్నా క్షణాల్లో అధికార పార్టీ నాయకులకు చేరిపోతోంది. అన్ని పోలీస్ స్టేషన్లలో స్థానికులుండడం అధికార పార్టీకి వరంగా మారింది. ఒకే చోట ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న వారికి బలమైన పరిచయాలు ఏర్పడ్డాయి. అదే ప్రాంతాల్లో రేపు పోలింగ్ బూత్‌ల వద్ద క్షేత్రస్థాయి విధులు కేటాయించాల్సి ఉంటుంది. దాంతో ఒకే చోట పుట్టి, పెరిగి, విధులు నిర్వహించిన సిబ్బంది చాలా సులభంగా ప్రజలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. అలాగే రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించేందుకు కూడా వారికి చాలా అవకాశం ఉంది.క్షేత్రస్థాయి పరిస్థితులను లోతుగా పరిశీలించి జిల్లావ్యాప్తంగా ఎక్కడికక్కడ చిరకాలంగా పాతుకుపోయిన రక్షకభటులను బదిలీ చేసే ప్రక్రియను ఉన్నతాధికారులు చేపట్టాల్సివుంది.

తిరుమల ఘాట్‌లో అదుపు తప్పిన బస్సు

చెట్టును ఢీకొని ఆగడంతో బయటపడిన ప్రయాణికులు



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

తిరుమల, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్ రోడ్డులో సోమవారం పెనుప్రమాదం తప్పింది. ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పింది. చెట్టును ఢీకొనడంతో లోయలోకి దూసుకుపోకుండా ప్రమాదం తప్పింది. విజిలెన్స్ అధికారులు వివరాల మేరకు.. ఏపీ 03 జెడ్ 5617 నెంబరు గల ఆర్టీసీ బస్సు 15 ప్రయాణికులతో సోమవారం మధ్యాహ్నం తిరుపతి నుంచి తిరుమలకు బయలుదేరింది. హరిణి ప్రాంతానికి సమీపంలో ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి ఎడమవైపు పిట్టగోడను బలంగా ఢీకొంది. గోడసైతం పగిలిపోవడంతో ముందుకు దూసుకువెళ్లి చెట్టును ఢీకొని ఆగిపోయింది. బస్సులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. చెట్టు లేకుంటే లోయలోకి దూసుకుపోయి పెద్ద ప్రమాదం వాటిల్లి ఉండేది. విషయం తెలుసుకున్న పోలీసులు, విజిలెన్స్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని విచారణ మొదలుపెట్టారు. ప్రమాద నేపథ్యంలో కొంతసేపు వాహనాలు నిలిచిపోయాయి. బస్సును పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

18ఏళ్లు నిండినవారు ఓటుకు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 1 : జిల్లాలో సోమవారం నాటికి 18 సంవత్సరాలు నిండినవారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. దరఖాస్తుదారులకు వచ్చేనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఓటు హక్కు కల్పిస్తామని పేర్కొన్నారు. 14వ తేదీ తర్వాత వచ్చే దరఖాస్తులను ఎన్నికల తర్వాత పరిశీలిస్తామని వివరించారు. ఓటరు హెల్ప్‌లైన్‌యాప్, బీఎల్వో ద్వారా ఫారం 6 దరఖాస్తు చేసి ఓటు హక్కును పొందవచ్చునని తెలిపారు. కొత్తగా ఓటు పొందడానికి ఇదే చివరి అవకాశమని పేర్కొన్నారు.

33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 1: పోలింగ్ రోజున విధుల్లో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ కల్పిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్నికల సమయంలో అత్యవసర సేవలు అందించే 33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కేటాయించడంపై ఆయన సమీక్షించారు. సంబంధిత శాఖలకు చెందిన ఫారం 12డి దరఖాస్తును పూరించి ఈ నెల 22వ తేదీలోపు సంబంధిత ఆర్వో, ఏఆర్వోలకు అందజేయాలన్నారు. ఆర్వో, ఏఆర్వో వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ ఏర్పాటు చేస్తారని, సదరు ఉద్యోగులు అక్కడికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని అన్నారు.

వలంటీర్లపై రాజీనామాలకు ఒత్తిడి

కోట, ఏప్రిల్ 1: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వలంటీర్లను ప్రచారానికి వాడుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నాలు సాగిస్తున్నారు. రాజీనామాలు చేసి వైసీపీ తరఫున ప్రచారం చేస్తే అధికారంలోకి వచ్చాక అదే వలంటీర్ పోస్టులు తిరిగి ఇస్తామంటూ ప్రలోభాలకు గురిచేస్తున్నారు.కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో రెండు వారాల నుంచి ఈ వ్యవహారం సాగుతోంది.ఒక వైసీపీ నాయకుడు ఒక వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేసి ఆ సచివాలయ పరిధిలోని వలంటీర్లను ఆ గ్రూపులో సభ్యులుగా చేరుస్తున్నారు.స్వచ్ఛందంగా వలంటీరు పోస్టులకు రాజీనామా చేసి వారి పరిధిలో ఉన్న గృహాలకు వెళ్లి పింఛన్లు, పొదుపు గ్రూపు సభ్యులు, ఆసరా, చేయూత లబ్ధిదారులను ఫ్యాన్ గుర్తుకు ఓటువేయించే బాధ్యత తీసుకోవాలని గ్రూపుల్లో మెసేజ్‌లు ఫార్వార్డ్ చేస్తున్నారు. పొరపాటున చంద్రబాబుకు సైకిల్‌గుర్తుపై ఓటువేస్తే సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని ప్రచారం చేయాలని ఒత్తిడి చేస్తున్నారు.అందుకు నిరాకరించిన వలంటీర్లను బెదిరిస్తున్నట్లు సమాచారం.ఆదివారం కొన్ని మండలాల్లో అనుకూలమైన వలంటీర్లతో వైసీపీ నేతలు సమావేశాలు కూడా పెట్టుకున్నట్లు సమాచారం.

సర్టిఫికెట్లు జారీ చేసే వారేరీ?

విద్యార్థుల భవిష్యత్తుతో అధికారుల చెలగాటం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 1: అధికారులు సర్టిఫికెట్లు జారీ చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యా సంవత్సరం ముగింపు సమయంతో పాటు పలు ప్రవేశ పరీక్షలకు కూడా ఇది అత్యంత కీలకమైన సమయం. ఎంసెట్, పాలిసెట్ వంటి ప్రవేశ పరీక్షల కోసం పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సిఉంటుంది. అందుకోసం కుల, ఆదాయ, స్థానికత వంటి ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా జత చేయాలి. వీటిని రెవెన్యూ అధికారులు సకాలంలో దరఖాస్తుదారులకు జారీ చేయాలి.సకాలంలో దరఖాస్తు చేసుకోకపోతే ఒక విద్యా సంవత్సరం వృధాగా మారే ప్రమాదం లేకపోలేదు. శ్రీకాళహస్తిలో సచివాలయాల ద్వారా సర్టిఫికెట్ల కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేవారు. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు పరిశీలన చేసి సర్టిఫికెట్లు జారీ చేసేవారు.పది రోజులనుంచి సచివాలయాల్లో విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం లేదు. దాంతో మీసేవ కేంద్రాల్లో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఆ తర్వాత సర్టిఫికెట్ కోసం దరఖాస్తు రశీదుతో విద్యార్థుల తల్లిదండ్రులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఎన్నికల విధుల పేరుతో సామాన్య జనానికి రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండడం లేదు. రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగిన తర్వాత మీసేవ నుంచి చేసిన దరఖాస్తు పనిచేయదంటూ చావు కబురు చల్లగా చెబుతున్నారు. దాంతో మళ్లీ లబోదిబోమంటూ సచివాలయాల వెంట పడుతున్నారు. అక్కడ దరఖాస్తులను స్వీకరించడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా సర్టిఫికెట్ల జారీపై శ్రద్ధ వహించాల్సివుంది.

నేటినుంచి ముత్యాలమ్మ జాతర





ముత్యాలమ్మ దేవస్థానం - బంగారుచీర అలంకరణలో ముత్యాలమ్మ, పోలేరమ్మ (ఫైల్‌ఫొటోలు)

చిల్లకూరు, ఏప్రిల్ 1: చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ జాతర మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. మంగళవారం రాత్రి గంగమిట్ట మీద ఘటం నిలిపి కుమ్మరి తయారు చేసిన పోలేరమ్మ విగ్రహాన్ని రజకులు తీసుకువచ్చి తాటాకు గుడిసెలో తాత్కాలికంగా ప్రతిష్ఠించడంతో జాతర మొదలవుతుంది. జాతరలో ముత్యాలమ్మతో పాటు పోలేరమ్మకు భక్తులు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ.

శాక్తేయ పద్ధతిలో పూజలు

నేటి చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరు, ఈదలవారిపాళెం, పోసినవారిపాళెం, రావులవారిపాళెం గ్రామాలు 1918కి పూర్వం వెంకటగిరి రాజుల పాలనలో ఉండేవి. ఈ ప్రాంతాలకు అధిపతులుగా ఉన్న వెంకటగిరి రాజులు తూర్పు కనుపూరులో సింహాద్రి రామలింగయ్యశెట్టి ద్వారా శక్తి స్వరూపిణి అయిన ముత్యాలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసినట్లు స్థానికుల కథనం. అప్పటి నుంచి ఏటా ఉగాది పర్వదినానికి వారం ముందు మంగళవారం నుంచి గురువారం వరకు జాతర నిర్వహించడం ఆనవాయితీ. 1942లో రాతిగోడలు పూరికప్పుతో నిర్మించి పూజలు నిర్వహించేవారు. అదేవిధంగా పోతురాజు చలుకను కూడా ఏర్పాటు చేసి పూజలు జరిపించేవారు. 1960లో వచ్చిన తుఫాను తాకిడికి గ్రామాలు అల్లకల్లోలం కావడంతో ముత్యాలమ్మ దేవస్థానం కూడా ధ్వంసమైంది. అమ్మవారి విగ్రహం కుడిచేయి విరిగిపోయింది. 1962లో సింహాద్రి రామలింగయ్యశెట్టి కుటుంబీకులు ఈ దేవాలయాన్ని పునర్నిర్మించారు. 1982లో అమ్మవారి నూతన బింబప్రతిష్ఠ జరిగింది. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా అమ్మవారి జాతర నిర్వహిస్తున్నారు. 1991 నుంచి దేవాదాయశాఖ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి పరిచారు. 1999లో దేవస్థాన జీర్ణోద్ధరణ మహాకుంభాభిషేక కార్యక్రమాలు జరిగాయి. అప్పటి నుంచి పూజలు శాక్తేయ పద్ధతిలో నిర్వహిస్తున్నారు.

2నుంచి 5వ తేదీ వరకు జాతర

జాతరలో భాగంగా 2వ తేదీన మంగళవారం రాత్రి పోలేరమ్మ నిలుపుదల, 3న యార గురునాథ స్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవం, గొల్లల వేడుకలు, 4వ తేదీ పగలు గురునాథస్వామి గ్రామోత్సవం, రాత్రి అమ్మణ్ణి ఉయ్యాల సేవ జరుగుతుంది. 5న శుక్రవారం ఉదయం పోలేరమ్మను సాగనంపే ఉత్సవం, వేలంపాటలు నిర్వహిస్తారు.

భక్తులకు ఏర్పాట్లు

జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. అమ్మవారి జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమినాడు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో రానున్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో భక్తులకు సౌకర్యార్థం తాగునీరు, వైద్య సదుపాయం, మరుగుదొడ్ల ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు వివిధ సేవాసంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు అందజేయనున్నారు. రాత్రివేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గూడూరు, నెల్లూరు, కోట, వాకాడు, చిట్టమూరు, గుమ్మళ్లదిబ్బ, నాయుడుపేట, సూళ్లూరుపేట, నెల్లూరు, వెంకటగిరి నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నారు. నాలుగురోజులు పాటు జరిగే జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆర్డీవో కిరణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెన్షన్లు ఇవ్వలేక టీడీపీపై అభాండాలా: పాశం



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు అర్బన్, ఏప్రిల్ 1: రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టేసిన వైసీపీ ప్రభుత్వం నిధుల కొరతతో పెన్షన్లు అందించలేక టీడీపీపై అభాండాలు మోపడం సరికాదని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షన్ల సొమ్ముతో పాటు ఇతర నిధులు రూ.13వేల కోట్లు సొంత కాంట్రాక్టర్లకు వైసీపీ ప్రభుత్వం దోచిపెట్టిందన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఎన్నికల కమిషన్, టీడీపీపై దుష్ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. పెన్షన్లకు సంబంధించిన నిధులను ట్రెజరీలో జమ చేయకుండానే అసత్యప్రచారాలు చేయడం తగదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతినెలా 1వ తేదీ రూ. 4వేల పెన్షన్ ఇంటి వద్దే అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇకనైనా అసత్యప్రచారాలు మానుకోని పేదలకు పెన్షన్ అందించేలా చర్యలు తీసుకోవాలని సునీల్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రవీంద్రరెడ్డి, పెంచలయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అసమర్థ పాలనతో రాష్ట్రం అధోగతిపాలు

గూడూరు, ఏప్రిల్ 1: వైసీపీ ప్రభుత్వ అసమర్థత పాలన వల్ల రాష్ట్రం అధోగతి పాలైందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని విందూరు, సంతదాసుపల్లి, రామలింగాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదన్నారు. ఇంటి పన్నులు, విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెంచివేయడంతో పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లగలిగిన నాయకుడు చంద్రబాబునాయుడేనన్నారు. రానున్న ఎన్నికలలో ఉమ్మడి ప్రజాప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీలోకి చేరడంతో వారికి పార్టీ కండువాలను ఆహ్వానించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మల్లికార్జున్‌రెడ్డి, పెంచలరెడ్డి, నారాయణరెడ్డి, దుద్దా రాఘవరెడ్డి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, పల్లంపర్తి మధురెడ్డి, మట్టం శ్రావణి, ఇనుకుర్తి మల్లికార్జున్‌నాయుడు, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూటమిని గెలిపించండి



ప్రచారంలో సంధ్యారాణి, టీడీపీ నాయకులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 1: రాష్ట్రాభివృద్ధి కోసం ఉమ్మడి కూటమిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక రాణిపేట ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రానికి దోచుకోవడమే పనిగా పాలన సాగించారన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగడంతో పాటు సంక్షేమ పథకాలు అందాలంటే చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నిమ్మకాయల నరసింహులు, తిరుపాల్, కృష్ణకుమారి, పృథ్వీ, రవి, అశోక్, పులిమి శ్రీనివాసులు, వాటంబేడు శివకుమార్, శ్రీదేవి, తాళ్ల సుబ్బమ్మ, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గూడూరు, ఏప్రిల్ 1: త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఓటర్లందరూ ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఒకటో పట్టణ సీఐ పాపారావు అన్నారు. సోమవారం పట్టణంలో పారామిలటరీ సిబ్బందితో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు భయాందోళనకు గురికాకుండా వారిలో ధైర్యం నింపేందుకు పారామిలటరీ సిబ్బందితో కవాతు నిర్వహించామని తెలిపారు. ఓటర్లను ఎవరైనా ఇబ్బందులు పెట్టినా, ప్రలోభాలకు గురిచేసినా కఠిన చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో రెండో పట్టణ సీఐ రవికిరణ్, పారామిలటరీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన

పెళ్లకూరు, ఏప్రిల్ 1: మండలంలోని తాళ్వాయిపాడు, శిరసనంబేడు గ్రామాల్లో సోమవారం ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు కేవీఆర్వీ ప్రసాద్‌రావు, ఎంపీడీవో అన్నపూర్ణరావు మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎన్నికల నియమావళిపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంతోషిబాయి, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాశ్, ఏఎస్‌వో మోహన్‌రావు, వీఆర్వోలు రమేష్, వంశీకృష్ణా, పంచాయతీ కార్యదర్శి జనార్దన్, సర్వేయర్ పూజిత, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గంగాప్రసాద్



గంగాప్రసాద్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 1: నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా పసల గంగాప్రసాద్ ఎంపికైనట్లు సీనియర్ న్యాయవాది మండిగ సోమశేఖర్ తెలిపారు. అలాగే వైస్ ప్రెసిడెంట్‌గా పొట్లపూడి శ్రీనివాసులు, సెక్రటరీ వీరాస్వామి, జాయింట్ సెక్రటరీ రఫీ, ట్రెజరర్ సురేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు అమర్‌నాథ్, నిత్య, పరుశురామయ్య, మోహన్‌కృష్ణ, సునీల్ ఎంపికయ్యారు. సోమవారం కోర్టు ప్రాంగణంలో గంగాప్రసాద్‌ను న్యాయవాదులు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరనాథ్‌రెడ్డి, దశయ్య మొదలియార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ

తడ, ఏప్రిల్ 1: సామాజిక పింఛన్లను సచివాలయంలో పంపిణీ చేస్తామని ఎంపీడీవో ఆమోస్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మండలంలో మొత్తం 6,055 మంది లబ్ధిదారులకు రూ.1.85 కోట్ల పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం బ్యాంకుల్లో నిధులను జమచేసిన వెంటనే పింఛన్లను పంపిణీ చేస్తామని ఎంపీడీవో చెప్పారు.

వైభవంగా ఘటోత్సవం



ఘటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

చిల్లకూరు, ఏప్రిల్ 1: ముత్యాలమ్మ జాతర సందర్భంగా సోమవారం ఘటోత్సవం నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి ఆలయ ప్రధాన అర్చకుడు రమణయ్య ఇంటి వద్ద తాటాకుల గుడిసె ఏర్పాటు చేసి, అందులో ఘటం ఉంచి పూజలు చేశారు. అనంతరం ఘటాన్ని నెత్తిపై పెట్టుకుని తప్పెట్లు, మంగళవాయిద్యాల నడుమ తూర్పుకనుపూరు, ఈదల వారిపాళెం, కొమరావారిపాళెం, రావులవారిపాళెం, పోసిన వారిపాళెం గ్రామాల్లో ఊరేగిస్తూ భక్తులకు ఆహ్వానం పలికారు.

ముత్యాలమ్మ హుండీ లెక్కింపు



ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారి హుండీ లెక్కింపు నిర్వహించారు. మూడు నెలల్లో అమ్మవారికి భక్తులు నగదు రూపంలో హుండీ ద్వారా చెల్లించిన కానుకలను లెక్కించగా రూ.14,78,120 ఆదాయం వచ్చినట్లు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అవ్వా తాతలను మోసం చేసిన జగన్: లక్ష్మీసాయిప్రియ



6వ వార్డులో కరపత్రాలు అందజేస్తున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, ఏప్రిల్ 1: ఓటమి తప్పదని గ్రహించిన సీఎం జగన్ సంక్షేమ పథకాల నిధులను దారిమళ్లించి అవ్వాతాతలను మోసం చేశారని వెంకటగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ విమర్శించారు. సోమవారం ఆమె పట్టణంలోని 6వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పింఛనుదారులకు ఇవ్వాల్సి రూ.13 వేల కోట్ల నిధులను తన అనుచరులైన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారని ఆరోపించారు. గడిచిన ఐదేళ్ల అరాచకపాలన సాగించిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో వున్న వనరులను దోచుకోవడమే కాకుండా చివరకు అవ్వా తాతలకు ఇచ్చే పింఛను సొమ్ము కూడా దారి మళ్లించడం దారుణమన్నారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితే ప్రజల ఆస్తులకు కూడా రక్షణ లేకుండా పోతుందని హెచ్చరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అవ్వా తాతలకు పింఛను రూ.4 వేలకు పెంచి ఇంటికెళ్లి అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, శ్రీరామదాసు గంగాధర్, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథనాయుడు, సామల లక్ష్మీపతి, జానపాటి మురళి, శ్రీరాంబాబు, పప్పు చంద్రమౌళి రెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, అవ్వారు సత్యనారాయణ, ముప్పాళ గురువేంద్ర నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపండి: కురుగొండ్ల



కురుగొండ్లను సన్మానిస్తున్న వైసీపీ నాయకుడు అరుణాచలం

డక్కిలి, ఏప్రిల్, 1: రాష్ట్రంలో ఐదేళ్ల పాటు అరాచక పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రజలకు పిలుపు నిచ్చారు. సోమవారం ఆయన మండలంలోని వెంబులూరు, నరసనాయుడుపల్లి, దేవులపల్లి, పాతనాలపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తన కుమార్తె లక్ష్మీసాయిప్రియను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక పాలనను చూసిన ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలని వైసీపీ నాయకులు ఎత్తుగడలు వేస్తున్నారని, వారి ప్రయత్నాలను ప్రజలే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తాను ఎమ్మెల్యేగా వున్న సమయంలో ప్రారంభించిన ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులను వైసీపీ ప్రభుత్వం ఆపేసి రైతులకు తీరని ద్రోహం చేసిందని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రిజర్వాయరు నిర్మాణాన్ని పూర్తిచేస్తామని చెప్పారు. అంతకుముందు ఆయన వెంబులూరు గ్రామంలో ఇటీవల మరణించి పెద్దగుండయ్య కుటుంబాన్ని పరామర్శించారు. దేవులపల్లిలో వైసీపీ నేత వెంకట్రామిరెడ్డి ఇంటికి వెళ్లి టీడీపీలో చేరాలని కోరగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. అలాగే పాతనాలపడులో వైసీపీ నాయకుడు అరుణాచలం కురుగొండ్ల రామకృష్ణకు స్వాగతం పలికి సన్మానించారు. నరసనాయుపల్లిలో వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. వారికి కురుగొండ్ల పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఆస్పత్రి అభివృద్ధి సలహా కమిటీ మాజీ చైర్మన్ చెలికం భాస్కరరెడ్డి, మచ్చల వేణు, వెంకటాద్రి, పెంచలరెడ్డి, మునికృష్ణయ్య, సురేంద్ర, రాంబాబు, నల్లాని రామచంద్రయ్య, పీపీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీపై బురదచల్లేందుకే పింఛన్ల డ్రామా: నెలవల

పెళ్లకూరు, ఏప్రిల్ 1: ఎన్నికల్లో ప్రయోజనం పొందడం కోసమే ప్రభుత్వం పింఛన్ల పంపిణీ విషయంలో డ్రామా ఆడుతోందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సోమవారం పెళ్లకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పింఛన్లు పంపిణీ చేయకూడదని తమ పార్టీ నాయకులు ఎప్పుడూ చెప్పలేదన్నారు. పింఛన్ల పంపిణీ సాకుతో ఇంటింటికీ వెళ్లి వైసీపీకి అనుకూలంగా వలంటీర్లు ప్రచారం చేస్తున్నారని, అందుకే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడం జరిగిందన్నారు. పరిపాలన చేతకాక ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన జగన్ పింఛన్లు పంపిణీ చేసేందుకు డబ్బులు లేక టీడీపీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పింఛన్లు తక్షణమే పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని నెలవల డిమాండ్ చేశారు.


పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోట, ఏప్రిల్ 1: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామంటూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. సోమవారం మండల పరిధిలోని సిద్దవరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పేర్నేటి నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షణపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణతో పాటు గ్రామ వీధులకు ఇరువైపులా జామ, శీతాఫలం మొక్కలను నాటి, వాటిని దత్తత తీసుకున్నారు. కార్యక్రమంలో సహోపాధ్యాయులు నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 1: న్యాయవాది రాజగోపాలరెడ్డిపై మర్రిపాడు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి దాడి చేయడాన్ని ఖండిస్తూ సూళ్లూరుపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ న్యాయవాదులకు కూడా రక్షణ లేకుండాపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదిపై దాడిచేసిన ఎస్ఐపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పీఎన్ఆర్‌వీ ప్రసాద్, మాల కొండయ్య, లొక్కు గణపతి తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



పెళ్లకూరు, ఏప్రిల్ 1: మండలంలోని పునబాక రైస్‌మిల్లు ఎస్టీ కాలనీలో ఒక పూరిల్లు దగ్ధమైంది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు... కాలనీకి చెందిన కవిత ఇంట్లో సోమవారం షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగాయి. ఈ సమయంలో గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో మంటలు మరింత వ్యాప్తి చెందాయి. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా రావడంతో పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

యువతి ఆత్మహత్య

చిల్లకూరు, ఏప్రిల్ 1: మండలంలోని మోమిడి గ్రామానికి చెందిన ఓ యువతి ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... గ్రామానికి చెందిన చెంచు లక్ష్మి(19) వ్యక్తిగత కారణాలతో మనస్థాపానికి గురై గుళికలు తిని అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోట, ఏప్రిల్ 1: కోటలోని బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో శంకరయ్య సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని చెప్పారు.

ఎస్ఆర్‌కే విద్యార్థులకు నవోదయ సీట్లు

నాయుడుపేట, ఏప్రిల్ 1: జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశ పరీక్షల్లో డాక్టర్ ఎస్ఆర్‌కే కోచింగ్ సెంటర్ విద్యార్థులు సీట్లు సాధించారు. ఆర్. కౌసిక్, పి.లోహిత్‌కుమార్, ఎస్.హర్షవర్ధన్ నవోదయకు ఎంపిక కావడంతో వారిని ఎస్ఆర్‌కే డైరెక్టర్ షేక్ స్కైలాబ్ బేగం, ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు ఎస్‌కే కాలేషా, చిరంజీవి, నిరూత్, ప్రేమ్, మురళి అభినందించారు.

అభివృద్ధికి... కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు: పరసా



కలిపేడులో పరసా వెంకటరత్నం, విజయశ్రీకి సన్మానం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 1: అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్... చంద్రబాబు అని మాజీమంత్రి పరసా వెంకటరత్నం అన్నారు. మండలంలోని కూచివాడ, కలిపేడు, పండ్లూరు గ్రామాల్లో సోమవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరసా రత్నం మాట్లాడుతూ చంద్రబాబు హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని గుర్తుచేశారు. అభివృద్ధితో రాష్ట్రానికి అనేక పరిశ్రమలను రప్పించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. రైతాంగాన్ని కూడా ఆదుకున్నారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని, రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నెలవల విజయశ్రీ మాట్లాడుతూ వైద్య రంగాన్ని వదిలి ప్రజాసేవకోసం రాజకీయాల్లోకి వచ్చానని, నన్ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీరాం ప్రసాద్, సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రాజేంద్ర, కిష్టయ్య, మస్తానయ్య, చక్రపాణి, సుబ్బరాయులు, పరసా వెంకటరాజ, సుజాతమ్మ, దయాకర్‌నాయుడు, ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 1: రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి పరసా వెంకటరత్నం అన్నారు. సోమవారం సూళ్లూరుపేట పట్టణంలో టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పరసా రాష్ట్రంలో అరాచక పాలనకు కౌంటౌడౌన్ ప్రారంభమైందని, ప్రజలు ఎక్కడికి వెళ్లిన టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా వేనాటి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు యువకులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాయకులు నలజాం రాము, నాపా మునిరాజా, గంపల రవి, పూడి రవి, మధు, సుజాత, సరళ, బుజ్జిబాబు, మునస్వామి, బుద్ధి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భట్ల కనుపూరులో గంధోత్సవం



దర్గా వద్దకు గంధాన్ని తీసుకెళ్తున్న మధుసూదనరెడ్డి తదితరులు

ఓజిలి, ఏప్రిల్ 1: మండలంలోని భట్ల కనుపూరులో సోమవారం రాత్రి మస్తాన్‌వలి, ఖాదర్‌వలి ప్రథమ గంధోత్సవ వేడుకలు నిర్వహించారు. గున్నం సేవా ట్రస్టు అధినేత గున్నం మధుసూదనరెడ్డి దర్గా, గంధోత్సవ దాతగా వ్యవహరించారు. మధుసూదనరెడ్డి ఇంటి వద్ద నుంచి ఫకీర్ వాయిద్యాలతో జెండాలు చేతపట్టి గంధం తీసుకుని దర్గా వద్దకు వెళ్లి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, టీడీపీ సీనియర్ నాయకులు బచ్చల రవీంద్రరెడ్డి, నెలవల రాజేష్, వెంకటసుబ్బరాజు, దామోదరరాజు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

వలంటీర్లతో సంబంధాలొద్దు

కోట, ఏప్రిల్ 1: సచివాలయ సిబ్బంది విధి నిర్వహణకు సంబంధించి వలంటీర్లతో ఎటువంటి సంబంధాలు పెట్టుకోరాదని, ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శంకరయ్య హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన డివైజర్లు, సెల్‌ఫోన్లు, సిమ్ కార్డులు పంచాయతీ కార్యదర్శుల ద్వారా మంగళవారం సాయంత్రంకల్లా మండల పరిషత్ కార్యాలయానికి చేర్చాలని ఆదేశించారు. అదేవిధంగా నిర్దేశించిన క్లస్టర్లు, సచివాలయాల్లో మాత్రమే పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

వెంకటగిరి, ఏప్రిల్ 1: వైసీపీ నుంచి టీడీపీలో చేరే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సోమవారం డక్కిలి మండలం నరపనాయుడుపల్లెకు చెందిన పలు కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరాయి. అలాగే వెంకటగిరి రూరల్ మండల పరిధిలోని కె.ఉప్పరపల్లెకు చెందిన 30 కుటుంబాలు టీడీపీ మండల అధ్యక్షుడు పప్పు చంద్రమౌళి రెడ్డి, స్థానిక నాయకులు రమేష్, సాయిమార్, వెంకటేశ్వర్లు, శివ ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. వీరందరికి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.